**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట | : 99854 38368 |
| చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు | : 99854 10940 |
| పలమనేరు, కుప్పం, పుంగనూరు | : 97036 18724 |
| మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి | : 99854 22298 |
| శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు | : 99890 59755 |



దెబ్బతిన్న వరిపంటను కలెక్టర్‌కు చూపుతున్న రైతులు

# నకిలీ వరి విత్తనాలతో నిండా మునిగిపోయాం

**పీజీఆర్ఎస్‌లో రైతుల ఆవేదన**

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'మా ప్రాంతంలో వరి ఎక్కువగా పండిస్తాం. ఓ డీలరు మమ్మల్ని మోసం చేసి నకిలీ వరి విత్తనాలు ఇవ్వడంతో నిండా మునిగిపోయాం' అని సూళ్లూరుపేట ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు హాజరై దెబ్బతిన్న వరి పంటను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చూపారు. 'సూళ్లూరుపేటలోని పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్‌లో సెప్టెంబరు నెలలో బీపీటీ 2782 నెంబరు వరి విత్తనాలను కొన్నాం. సూళ్లూరుపేటతో పాటు దొరవారిసత్రం, వరదయ్యపాళెం రైతులూ వీటిని కొన్నారు. పైరు నాటిన 20 రోజులకే పొట్టు వెన్ను రావడంతో తీవ్రంగా నష్టపోయాం. సుమారు 2వేల ఎకరాల్లో ఆ డీలర్ ఇచ్చిన నకిలీ విత్తనాల వల్ల పంట దెబ్బతింది. దీనిపై అడిగితే ఎలాంటి సమాధానం లేదు. ఆ కంపెనీ వాళ్లేమో వారికి సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. నకిలీ విత్తనాలు సరఫరాచేసి పూజిత ఆగ్రో సర్వీస్, అన్నపూర్ణ సీడ్స్‌పై క్రిమినల్ కేసులు నమోదుచేసి మాకు నష్టపరిహారం చెల్లించండి' అని కలెక్టర్‌కు భాస్కర్‌రెడ్డి, చలపతి, సుబ్బారెడ్డితో పాటు 20మంది రైతులు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని బాధిత రైతులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. దీనిపై విచారించాలంటూ జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావును ఆదేశించారు.

పీజీఆర్ఎస్‌లో భూ సమస్యలే ఎక్కువ

8

## 15 నుంచి నో హెల్మెట్.. నో పెట్రోల్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలలో దాదాపు 45 శాతం మరణాలు ద్విచక్ర వాహనదారుల మితిమీరిన వేగం, హెల్మెట్ లేకపోవడం వల్లే జరుగుతున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా హెల్మెట్‌పై అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో 15వ తేది నుంచి హెల్మెట్ లేకుంటే ద్విచక్ర వాహనాలకు పెట్రోలు పట్టకుండా నిబంధనలు అమలు చేయనున్నారు. ఇక, వెనుక కూర్చున్న వారూ హెల్మెట్ ధరించాలని పోలీసులు చెబుతున్నారు. సరైన రోడ్డు భద్రతా నియమాలు పాటించక ఎవరైనా మరణిస్తే.. ఆ కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుందనేది గుర్తించాలని ఎస్పీ సూచించారు.

# అంధ విద్యార్థి సాహసం



చిత్తూరు శివారు ప్రాంతమైన పెరిగపల్లె వద్ద హర్షవర్ధన్ స్కేటింగ్

## నంగిలి నుంచి పుత్తూరు దాకా హైవేపై స్కేటింగ్ మారథాన్

## పిల్లల్లో డ్రగ్స్, మొబైల్ వ్యసనాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం

చిత్తూరు అర్బన్/బంగారుపాళ్యం/శ్రీకాళహస్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే చూపులేదు. కానీ సెల్‌ఫోనుకు వ్యసనమై మిగతా పిల్లలూ కంటి చూపును కోల్పోకూడదు. డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోకూడదు. ఈ దిశగా పిల్లల్లో అవగాహన కల్పించడానికి 11 ఏళ్ల అంధబాలుడు టాస్క్ రోడ్డు స్కేటింగ్ మారథాన్‌కు పూనుకున్నాడు. కర్ణాటక సరిహద్దులోని నంగిలి నుంచి సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమైన స్కేటింగ్ యాత్ర పలమనేరు, బంగారుపాళ్యం, చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి మీదుగా దాదాపు 230 కిలోమీటర్లు పూర్తి చేసుకుని పుత్తూరుకు చేరుకుంది. ఈ యాత్ర రాత్రి 10.20 గంటలకు శ్రీకాళహస్తి పట్టణ సమీపం ఊరందూరు వద్దకు చేరుకోగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్వాగతం పలికారు. బాలుడి ప్రతిభను అభినందించారు. ఇతడి తల్లిదండ్రులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బాలుడికి ప్రోత్సాహకంగా రూ.20 వేలు అందించారు. టీడీపీ నేత కన్నలి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాత్ర పుత్తూరువైపు బయలుదేరింది. సోమవారం అర్ధరాత్రి దాటాక గమ్యస్థానాన్ని చేరుకునే అవకాశం ఉందని కోచ్ ప్రతాప్ తెలిపారు. ఈ సాహసాన్ని వజ్ర వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్సు సంస్థల ప్రతినిధులు రికార్డు చేశారు. కాగా, హర్షవర్ధన్ స్కేటింగ్ చేస్తూ వెళ్లే మార్గంలో ముందు, వెనకాల పోలీసులతో పాటు అంబులెన్స్ కూడా వెళుతోంది.



ఊరందూరు వద్ద హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎవరీ హర్షవర్ధన్?**

తిరుపతిలో నివసిస్తోన్న ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరుకు చెందిన మునిబాబు, రాజకుమారి దంపతులు కుమారుడు మురారి హర్షవర్ధన్. పుట్టుకతోనే అంధుడైన ఇతడు తిరుచానూరులోని నవజీవన్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గతేడాది శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి శిక్షణ తరగతులకు హాజరయ్యాడు. ఇతడి ప్రతిభను గుర్తించిన కోచ్‌లు ప్రతాప్, ప్రేమనాథ్ స్కేటింగ్ నేర్పించారు. పుత్తూరులోని టాలెంట్ స్కేటింగ్ అకాడమీలో ఆరునెలలు శిక్షణ తీసుకున్నాడు. ఆరు నెలలుగా రోడ్డుపై వెళ్లేటప్పుడు వాహనాలతో పాటు ఎత్తుపల్లాలను దాటుకుని ఎలా వెళ్లాలో శిక్షణ తీసుకున్నాడు. పిల్లల్లో డ్రగ్స్, మొబైల్ వ్యసనాలపై అవగాహన కల్పించడమే తన మారథాన్ లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు. శాప్ చైర్మన్ రవి నాయుడి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా ఆయన తిరుపతి,చిత్తూరు జిల్లాల క్రీడాసాధికార సంస్థ అధికారులకు సహకారం అందించాలని సూచించారు. వ్యక్తిగతంగానూ ఆర్థికసాయం అందించారు.

# 11న ఎంపీపీ, వైస్‌ఎంపీపీ ఎన్నికలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు సంబంధించి ఏర్పేడు, వరదయ్యపాళెం ఎంపీపీ.. సత్యవేడు వైస్ ఎంపీపీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వీటిని ఈనెల 11న ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ ఎన్నికలకు ఆయా ఎంపీడీవోలు ఏర్పాట్లు చేస్తున్నారు. వరదయ్యపాళెం ఎంపీపీ ఎన్నిక విషయంలో కోర్టు ఉత్తర్వుల కారణంగా వాయిదా వేసినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఈఎన్నికలకు అబ్జర్వర్‌గా ఇన్‌చార్జి జేసీ మౌర్య వ్యవహరించనున్నారు.

CTBTA
DATE 09-12-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION
టుడే సప్లై రేట్ 143/- | డ్రెస్డ్ స్కిన్‌తో 257/-
రిటైల్ లైవ్ బర్డ్ 168/- | స్కిన్‌లెస్ 280/-
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయబడినది

## నేటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలు

- జిల్లాలో 9, చెన్నైలో 3 కేంద్రాల ఏర్పాటు

తిరుపతి(విద్య), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్షలు మంగళవారం నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు తిరుపతిలోని జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్, శ్రీరామ, అన్నమాచార్య, ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలు.. పుత్తూరులో వెంకట పెరుమాల్, గూడూరు ఆదిశంకర, నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలు, కోట ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలను కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. అలాగే చెన్నై కుంద్రత్తూరు సారధి నగర్‌లోని అయాన్ డిజిటల్ జోన్, చెంగల్పట్టు జిల్లా పొన్మార్‌లో డాక్టర్ కె. వాసుదేవ ఇంజినీరింగ్ కళాశాల, గుమ్మిడిపూండి, మంగవరం శ్రీ జయరాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలుజరుగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలను నిర్వహించనున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. హాల్‌టికెట్, ఏదేని ఒరిజనల్ గుర్తింపు కార్డు తీసుకురావాలి.

# తిరుపతిలో ఈట్ స్ట్రీట్

## జోరుగా సాగుతున్న పనులు



తిరుపతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఈట్ స్ట్రీట్ (ఫుడ్ కోర్ట్)కు వేగంగా అడుగులు పడుతోంది. ప్రస్తుత నగరపాలక సంస్థ కార్యాలయానికి ఎదురుగా ఉన్న అచ్యుత దేవరాయలు మార్గంలో ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 40 నుంచి 50 స్టాళ్ల ఏర్పాటు చేయనున్నారు. 8/16 సైజు గల 12 కంటైనర్లను స్టాళ్లుగా మార్చనున్నారు. మిగిలినవి నిర్దేశించిన ఖాళీ స్థలాన్ని స్టాళ్లగా మార్చుకునేందుకు టెండరుదారుకు కేటాయించనున్నారు. రెండు నెలల్లో పూర్తి చేసి, ఫుడ్ కోర్టు అందుబాటులోకి తీసుకురానున్నట్టు కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరిగాయి. కపిలతీర్థం రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, వెస్ట్ చర్చి ప్రాంతాలను పరిశీలించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక కమిషనర్ మౌర్య ఫుడ్ కోర్ట్‌పై ప్రత్యేక చొరవ చూపించారు. దాదాపు రూ.80లక్షలతో ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తీసుకుని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఫుడ్ కోర్టులోని స్టాళ్లను టెండర్ల ద్వారా కేటాయించనున్నారు.

## సంస్కృత వర్సిటీలో లైంగిక వేధింపులపై హోం మంత్రి ఆరా

తిరుపతి(నేరవిభాగం/విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపుల కేసు దర్యాప్తు పురోగతిపై సోమవారం హోంమంత్రి అనిత ఆరా తీశారు. ఆమె ఎస్పీ సుబ్బరాయుడితో మాట్లాడారు. 'ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదురాగానే కేసు నమోదు చేశాం. దర్యాప్తు అధికారిగా డీఎస్పీభక్తవత్సలంను నియమించాం. బాధితురాలి వాగ్మూలం తీసుకోవడానికి డీఎస్పీ ఆధ్వర్యంలో వెస్ట్ సీఐ మురళీ మోహన్, అలిపిరి ఎస్ఐ అజిత, మహిళా కానిస్టేబుళ్లు ఒడిశావెళ్లారు. తిరుపతిలో దర్యాప్తు చేయడానికి మరో బృందాన్ని ఏర్పాటు చేశాం. ఇలా ఒక కేసులో రెండుబృందాలతో ముమ్మరంగా విచారణ చేపట్టాం' అని హోం మంత్రికి ఎస్పీ వివరించారు. ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం చేసి బాధితురాలికి త్వరగా న్యాయంజరిగేలా చూడాలని మంత్రి అనిత ఆదేశించారు.

## నేడు షిర్డి రైలు ప్రారంభం

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- షిర్డీ రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలును మంగళవారం ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి సోమన్న వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి తిరుపతి కార్యక్రమంలో పాల్గొంటారని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు సంజయ్ కుమార్ శ్రీవాత్సవ మంగళవారం తిరుపతికి చేరుకోనున్నారు ఈ ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లను సోమవారం గుంతకల్లు అదనపు డివిజన్ మేనేజరు యు.సుధాకర్ పరిశీలించారు. డిప్యూటీ సీఈ వామనమూర్తి, డి.ప్రభాకర్, మాధవరావు, ఆర్కే సింగ్, సంజయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మీపై సీబీఐ కేసులున్నాయ్

- రిటైర్డు టీచరుకు సైబర్ నేరగాళ్ల బెదిరింపులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మీపై సీబీఐ కేసులున్నాయంటూ తిరుపతిలోని ఓ విశ్రాంత ఉపాధ్యాయుడికి సైబర్ నేరగాళ్లు ఫోనుచేసి బెదిరించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన ప్రకారం.. తిరుపతిలో ఒక రిటైర్డు టీచర్‌కు ఈనెల 6న ఫోను వచ్చింది. 'నేను సీబీఐ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నా. మీ ఫోన్ నెంబరు నుంచి మహిళలకు అనుచిత మెసేజ్‌లు పంపిన కేసులో విచారణకు మీరు బెంగళూరుకు రావాలి' అని బెదిరించారు. ఆ తర్వాత తాము ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. 'ఇప్పుడు పోలీసులకు కాల్ కనెక్టు చేస్తున్నాం. మీపై సీబీఐ కేసులున్నాయి. మీరు ఆధార్ కార్డు అమ్మడంతో.. మీ పేరిట బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేశారు. రూ.మూడు కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయి. ఈ కేసు సుప్రీంకోర్టుకు వెళ్లింది. దీనిపై పోలీసు అరెస్టు ఉంది. ఇంట్లో ఎవరికీ చెప్పొద్దు. గదిలోకి వెళ్లి డోర్ లాక్ చేసి మాట్లాడు. మీ వద్ద ఎంత డబ్బుందో చెప్పండి' అంటూ రిటైర్డు టీచర్‌ను మానసికంగా కుంగదీశారు. ఈ కేసుల్లో నిర్దోషిగా బయట పడాలంటే తక్షణం రూ.8 లక్షలు డిపాజిట్ చేయాలన్నారు. ఎక్కడో అనుమానం వచ్చిన ఆ రిటైర్డు టీచరు సోమవారం తిరుపతి సైబర్ క్రైం ఆఫీసులో ఫిర్యాదు చేశారు. అవి నకిలీ సైబర్ కాల్స్ అని, భయపడాల్సిన అవసరం లేదని సీఐ వినోద్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఇలాంటి వాటిపై వెంటనే 112కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

**స్వాధీనతా ప్రకటన**

**ICICI Bank**

ప్రాంతీయ కార్యాలయం: నం.1, సెనోటప్ రోడ్, తేనంపేట, చెన్నై-600018

**స్వాధీనతా ప్రకటన**

(స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) (ఇక మీదట "సదరు చట్టం") క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (ఇక మీదట "సదరు రూల్స్") లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు ప్రకటన స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా ప్రకటనలో తెలిపిన మొత్తం తిరిగి చెల్లించాల్సిందిగా రుణగ్రహీత,తనఖాదారులు,హామీదారులు ("సెక్యూరిటీ ప్రొవైడర్స్") పేర్లు: (1) **మెస్సర్స్ ట్రాక్ షూస్ ప్రైవేట్ లిమిటెడ్,** దాని కార్యాలయం నం.4/287, కుంద్రతూర్ మెయిన్‌రోడ్,కొవ్వూరు, చెన్నై-602101 మరియు ట్రాక్ షూస్ ప్రైవేట్ లిమిటెడ్, సర్వే నం.72/9 & 72/16, కురింజలం గ్రామం, వరదాయపాలెం, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్-517541, (2) **శ్రీ వెంకట్‌రావు నెక్కంటి,** చిరునామా: 16/2, రంజిత్ రోడ్డు, కొత్తూరుపురం, చెన్నై-600085 మరియు శ్రీ వెంకట్‌రావు నెక్కంటి, ఫ్లాట్ 1, అనుసాయి విల్లా, క్రిసెంట్ వీధి, ఎబిఎం ఎవెన్యూ, బోట్ క్లబ్, చెన్నై-600028 మరియు (3) **శ్రీ హరీశ్ నెక్కంటి,** చిరునామా: 16/2, రంజిత్ రోడ్డు, కొత్తూరుపురం, చెన్నై-600085 లను తిరిగి చెల్లించమని కోరుతూ **26 సెప్టెంబర్ 2025** తేది గల డిమాండ్ ప్రకటన జారీ చేశారు.

పైన తెలిపిన చట్టబద్ధమైన ప్రకటన స్వీకరించిన మీదట కూడా సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలు, తనఖాదారులు, హామీదారులు విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **08 డిసెంబర్ 2025న స్వాధీనం** చేసుకున్నారని ఇందుమూలంగా రుణగ్రహీత, తనఖాదారులు, హామీదారులు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా పైన పేర్లు కలిగిన రుణగ్రహీత, తనఖాదారులు, హామీదారులు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా **02 డిసెంబర్ 2025** నాటికి మొత్తం **రూ.22,70,45,546.77/- (రూపాయలు ఇరవై రెండు కోట్ల డెబ్బై లక్షల నలభై ఐదు వేల ఐదు వందల నలభై ఆరు మరియు డెబ్బై ఏడు పైసలు మాత్రమే)** మరియు దానిపై తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు చెల్లించే వరకు **ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్‌**కు చెల్లించుటకు లోబడి ఉంటాయి.

**సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13 లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీత, తనఖదారులు, హామీదారులు కోరబడుతున్నారు.**

సెక్యూర్డ్ ఆస్తి వివరణ

స్థిరాస్తి వివరాలు

తమిళనాడు, చెన్నై-602101, కాంచీపురం జిల్లా, గతంలో చెంగల్పట్టు జిల్లా, కుంద్రతూర్ తాలూకా, గతంలో సిరిపెరంబూర్ తాలూకా, కొవ్వూరు గ్రామం, కుంద్రతూర్ మెయిన్‌రోడ్, నం.4/287 వద్ద పారిశ్రామిక భవనం, షెడ్లు, ప్లాంట్ మరియు మెషినరీతో పాటు భూమి (పర్మిట్/ ప్లాన్ ఆమోదం ప్రకారం విస్తీర్ణం 43,268 చ.అడుగులు కంటే ఎక్కువ లేదా తక్కువ) యావత్తు.

**కాంచీపురం జిల్లా, కుంద్రతూర్ తాలూకా, గతంలో సిరిపెరంబూర్ తాలూకా, కొవ్వూరు గ్రామం వద్ద గల సర్వే నం.35/3బి2**

ఉత్తరం: సర్వే నం.20లో భూమి
దక్షిణం: సర్వే నం.35/2ఎ (భాగం)లో భూమి
తూర్పు: సర్వే నం.34లో భూమి
పశ్చిమం: సర్వే నం.35/3బి1లో భూమి

**కాంచీపురం జిల్లా, కుంద్రతూర్ తాలూకా, గతంలో సిరిపెరంబూర్ తాలూకా, కొవ్వూరు గ్రామం వద్ద గల సర్వే నం.35/3బి1**

ఉత్తరం: సర్వే నం.20లో భూమి
దక్షిణం: సర్వే నం.35/2ఎ (భాగం)లో భూమి
తూర్పు: సర్వే నం.35/3బి2 లో భూమి
పశ్చిమం: సర్వే నం.35/3ఎ లో భూమి

**కాంచీపురం జిల్లా, కుంద్రతూర్ తాలూకా, గతంలో సిరిపెరంబూర్ తాలూకా, కొవ్వూరు గ్రామం వద్ద గల పాత సర్వే నం.35/2, కొత్త సర్వే నం.35/2ఎ1**

ఉత్తరం: సర్వే నం.35/3బి1 మరియు 35/3బి2 లో భూమి
దక్షిణం: సర్వే నం.35/1బి1, 35/1బి2 మరియు 25/1బి3 లో భూమి
తూర్పు: సర్వే నం.33 లో భూమి
పశ్చిమం: సర్వే నం.35/2ఎ2 లో భూమి

**కాంచీపురం జిల్లా, కుంద్రతూర్ తాలూకా, గతంలో సిరిపెరంబూర్ తాలూకా, కొవ్వూరు గ్రామం, నం.59 వద్ద గల పాత సర్వే నం.35/1బి (భాగం), కొత్త సర్వే నం.35/1బి3**

ఉత్తరం: సర్వే నం.35/2ఎ (భాగం) లో భూమి
దక్షిణం: సర్వే నం.40 లో భూమి
తూర్పు: సర్వే నం.33 (భాగం) లో భూమి
పశ్చిమం: సర్వే నం.35/4 లో భూమి

పైన తెలిపిన భూమితో పాటు అన్ని భవనాలు మరియు నిర్మాణాలు దానిపై ఫిక్చర్స్, ఫిట్టింగ్స్, భూమికి జత చేయబడిన అన్ని ప్లాంట్ మరియు మెషినరీ లేదా భూమికి ఏదైనా శాశ్వతంగా అంటించబడినది లేదా రెండు ప్రస్తుత మరియు భవిష్యత్తు ఈ ప్రదేశ పాంగ్రణంపై గల ఆస్తి.

(ఆంధ్రప్రదేశ్, వరదాయపాలెం, కురింజలం గ్రామం, సర్వే నం.72/9 & 72/16 మరియు చెన్నై, కొవ్వూరు, కుందత్తూరు మెయిన్‌రోడ్ వద్ద గల లేదా మరెక్కడైనా ఉన్న అన్ని తనఖాపెట్టబడిన ఆస్తులపై ఏర్పాటు చేయబడిన సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్)

**తేది: డిసెంబర్ 09, 2025** (అధీకృత అధికారి)
ప్రదేశం: చెన్నై ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

## ఏఐ ఆధారిత వ్యవస్థతో తిరుమల ఆలయంలో అద్భుత ఫలితాలు

- ఐసీసీసీ పనితీరును వివరించిన అదనపు ఈవో



ఐసీసీసీలోని డ్యాష్ బోర్డు



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. మూడు నెలల కిందట తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో ప్రారంభించిన ఐసీసీసీ సెంటర్ పనితీరును సీవీఎస్వో మురళీకృష్ణ, సెంటర్ నిర్వాహకులు జేపీ(వర్చువల్)తో కలిసి ఆయన మీడియాకు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవిష్యత్తులో మంచి దర్శనం చేయించేందుకు డేటా జనరేట్ సిస్టమ్‌కు ఎంతోగానో సహాయ పడుతుందన్నారు. ఎన్ఆర్ఐ దాతల సహకారంతో రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల బడ్జెట్‌తో ఐసీసీసీని ప్రారంభించామని, ఇప్పటికే రూ.16.5 నుంచి రూ.17 కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక పరికరాలను సమకూర్చామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఈ వ్యవస్థపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, పలు సూచనలు చేశారన్నారు. అదనపు ఈవో వివరించిన దాని ప్రకారం..

**ఏఐ ఆధారిత వ్యవస్థవల్ల ఉపయోగం ఇదీ..**

దర్శనానికి ప్రతిరోజు ఎంతమంది భక్తులు వస్తున్నారు, ఏ కంపార్టుమెంట్లలో ఎంత సమయం వేచి ఉన్నారు, ఏ సమయంలో ఎంతమంది దర్శనం చేసుకుంటున్నారు, వారికి సకాలంలో అన్నప్రసాదాలు అందుతున్నాయా, కంపార్టుమెంట్లు ఏవైనా ఖాళీగా ఉన్నాయా వంటి వివరాలను ఈ వ్యవస్థ రికార్డు చేస్తుంది. ఎవరికి ముందు దర్శనం కల్పించాలో కూడా సూచన చేస్తుంది. కంపార్టుమెంట్‌లో 450 మందికి మించి భక్తులు ఉంటే వెంటనే రెడ్ అలర్ట్ ఇస్తుంది. ఒకవేళ తక్కువగా ఉంటే గ్రీన్ స్పేస్ కనిపిస్తుంది. వీరికి దర్శనానికి పట్టే సమయాన్ని కూడా తెలియజేస్తుంది. ఒక భక్తుడు ఎన్ని సార్లు దర్శనానికి వచ్చారు, ఏ సమయంలో ఎక్కడ ఉన్నాడు, ఎంత సమయంలో దర్శనం చేసుకున్నాడనే పూర్తి వివరాలు నమోదవుతాయి. ఇలా ప్రతి అంశం రికార్డు చేయడం ద్వారా దర్శన సమయాన్ని తగ్గించడానికి అవకాశం ఏర్పడుతుంది. అలాగే ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరిచేందుకు ఈ వ్యవస్థ కీలకంగా వ్యవహరించనుంది. ప్రస్తుతం తిరుమలలో, అలిపిరిలో ఎన్ని వాహనాలున్నాయి, ఎంత సమయం ఉన్నాయి, బ్లాక్ లిస్ట్‌లో ఉన్న వాహనాలేవైనా తిరుమలకు చేరుకున్నాయా, నో పార్కింగ్‌లో ఉన్న వాహనాలు ఎన్ని ఇలా ప్రతిదీ ఈ వ్యవస్థద్వారా తెలుసుకోవచ్చు. ఈ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు ప్రస్తుతం వైకుంఠం క్యూకాంప్లెక్స్1, 2తో పాటు నారాయణగిరి షెడ్లు, రింగురోడ్డులోని క్యూలైన్‌లో ఉన్న 69 గేట్లతో పాటు నడకమార్గాలు, అలిపిరిలో అదనంగా సుమారు 250 ఆధునిక కెమెరాలను ఏర్పాటు చేసి ఐసీసీసీకి అనుసంధానం చేయనున్నారు.

**భవిష్యత్తులో ఇవీ ప్రయోజనాలు..**

- కంపార్టుమెంట్లు, క్యూలైన్లలోని భక్తుల ఎమోషన్స్‌ని కూడా ఈ వ్యవస్థ ముందుగానే పసిగట్టి హెచ్చరిస్తుంది. ఏదైనా గొడవలు జరిగేట్లు ఉన్నా, అగ్నిప్రమాదాలు జరిగినా గుర్తించి ఆయా విభాగాల అధికారులకు సమాచారం చేరవేస్తుంది.
- పాతనేరస్తుల డేటాను కూడా ఈ వ్యవస్థలో పొందుపరుస్తారు. వీరిలో ఏవరైనా క్యూలైన్లు, కంపార్టుమెంట్లలోకి ప్రవేశిస్తే పసిగట్టి అలర్ట్ చేస్తుంది.
- ఎవరైనా తప్పిపోతే, ఆ వ్యక్తి ఫొటోను అప్‌లోడ్ చేసిన వెంటనే ఎక్కడ ఉన్నారో సులువుగా గుర్తిస్తుంది.
- ఎలక్ట్రికల్ వస్తువులతో పాటు నిషేధిత వస్తువులను గుర్తిస్తుంది.

## స్క్రబ్ టైఫస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ వెంకటరమణ, వైద్యాధికారిణి డాక్టర్ ఉదయశ్రీ తదితరులు

తిరుపతిరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్క్రబ్‌టైఫస్ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని దామినేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఉదయశ్రీ పేర్కొన్నారు. తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ చెందిలి వెంకటరమణ అధ్యక్షతన సోమవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిగర్‌మైట్ కీటకం ద్వారా ఈవ్యాధి సంక్రమిస్తుందని, ఇది కుట్టిన చోట శరీరంపై నల్లనిమచ్చ, తీవ్రజ్వరం, తల, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. సకాలంలో ట్రీట్‌మెంట్ తీసుకోకపోతే న్యూమోనియా, మెదడువాపు, అవయవాలు దెబ్బతినడం వంటివి జరుగుతాయని అవగాహన కల్పించారు. తీవ్ర జ్వరలక్షణాలు ఉన్నవారు ఎలిసా పరీక్ష చేయించుకోవాలన్నారు. చెత్తకుప్పలు వంటివి లేకుండా చూడడం, చేతులు, కాళ్లు కనబడకుండా దుస్తులు ధరించడం వంటివి పాటించాలని సూచించారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు సాంబశివరావు, బీజేపీ నేత మురళి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి.కీర్తి, ఏఎన్ఎంలు మల్లీశ్వరి, వాణి, ఆశావర్కర్లు కవిత, లత, వాణి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ ముఖ్యపాత్ర పోషించాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ లలితకుమారి

తిరుచానూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ముఖ్యపాత్ర పోషించాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ లలితకుమారి అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ బ్రాహ్మణపట్టు గ్రామంలో సోమవారం నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా లలితకుమారి, హోంసైన్స్ విభాగాధిపతి డాక్టర్ బిందు మాట్లాడుతూ ఈ శిబిరంలో సుమారు 50మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొని శుభ్రత, ఆరోగ్య అవగాహన, విద్య, పర్యావరణ సంరక్షణ వంటి అంశాలపై సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామప్రజల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతో వ్యాధులను అరికడదాం




పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

భాకరాపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత వ్యాధులను అరికడదామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ నాగరాణి అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం చెరువు ముందర పల్లెలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం పరిశుభ్రత పాటించాలన్నారు. టీకాలు, ఎయిడ్స్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోర్ సంస్థ ప్రతినిధులు తులసి, సుహాసిని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ముండ్లపూడిలో ఎన్ఎస్ఎస్ శిబిరం




శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

తిరుచానూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం తమ దత్తత గ్రామం ముండ్లపూడిలో డిసెంబరు 14 వరకు వారం రోజుల పాటు ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం, ఆరోగ్యంపై అవగాహన, వృక్ష సంపద పెంపొందించేందుకు మొక్కలు నాటడం, ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నారు. ముండ్లపూడి, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ కోరారు.

## 30న కల్యాణ వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

చంద్రగిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 30న వైకుంఠ ఏకాదశి, 31న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈరెండు పర్వదినాలను పురస్కరించుకుని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## రైతులకు 50 శాతం రాయితీపై చాఫ్ కట్టర్

చంద్రగిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ నుంచి పాడి రైతులకు శుభవార్త అందింది. పాడి రైతులకి అందుబాటులోకి 50 సబ్సిడీతో చాఫ్ కట్టర్ (గడ్డి కత్తిరించే యంత్రం) అందుబాటులోకి తీసుకువచ్చిందని నారావారిపల్లె పశు వైద్యాధికారి వంశీ ఒక ప్రకటనలో తెలిపారు. చాఫ్ కట్టర్ విలువ రూ.40,500 కాగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.20,250కే అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో అనిమల్ హజ్బెండ్రీ అసిస్టెంట్లను లేదా సమీప పశువైద్యశాల సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు.

## టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

వి.కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పదో తరగతి బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చిత్తూరు జిల్లా వి.కోట మండలం ముదిమడుగు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముదిమడుగు గ్రామానికి చెందిన తిమ్మరాజు కుమార్తె అను(15) వి.కోటలో 10వ తరగతి చదువుతోంది. కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండేది. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పనులపై బయటకు వెళ్లిన కుటుంబసభ్యులు ఇంటికి వచ్చే సరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు వి.కోట పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య సమస్యలతో చనిపోతున్నట్లు బాలిక డైరీలో రాసుకున్నట్లు కుటుంబ సభ్యుల విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు. బాలిక మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## తిరుచ్చిపై సీతారామలక్ష్మణ దర్శనం



చంద్రగిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామ సమేత లక్ష్మణ ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ హాస్టళ్ల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఓబీసీ విద్యార్థి సంఘనేత నాగేశ్వరరావు తదితరులు

తిరుపతిరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీసీహాస్టళ్లలో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. పెరిగినధరలు, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మెస్ చార్జీలను రోజుకు రూ.150, కాస్మోటిక్స్ చార్జీలు నెలకు రూ.500కు పెంచాలని కోరారు. అన్ని బీసీ హాస్టళ్లకు శాశ్వతభవనాలు నిర్మించాలని, బాలికల వసతిగృహాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, పోటీపరీక్షల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తరహాలో బీసీ విద్యార్థులకు ఫీజు సడలింపు వెసులుబాటు కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. సంఘనాయకులు పాల్గొన్నారు.

## ప్రైమరీ పాఠశాలలో సమగ్రశిక్ష ఏపీసీ తనిఖీ



చైతన్యపురం ప్రైమరీపాఠశాల వద్ద సమగ్రశిక్ష ఏపీసీ గౌరీశంకర్‌రావు తదితరులు

తిరుపతి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చైతన్యపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు సోమవారం ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ టెస్ట్‌పై ఆరాతీశారు. విద్యార్థులందరూ పూర్తిచేశారని టీచర్లు వివరించారు. ఆర్వో వాటర్ ప్యూరిఫైర్‌కు మరమ్మతులు చేయడంపట్ల హెచ్ఎంని అభినందించారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు. సెక్టోరియల్ అధికారి కేడీ సారథి, హెచ్ఎం చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అవిలాల చెన్నరాయ స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 52.20 లక్షలు

- ముఖ్యమంత్రికి, దేవదాయశాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలోని చెన్నరాయస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.52.20 లక్షలను మంజూరు చేసింది. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఈ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ నిధులకోసం కృషి చేశారు. నిధులు కేటాయించినందుకుగాను ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

## సహకార సంఘం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



డీసీసీ బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న సహకార ఉద్యోగులు

భాకరాపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం సహకార సంఘం ఉద్యోగులు చిన్నగొట్టిగల్లు డీసీసీ బ్యాంకు ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జీవో నెం.36ను అమలుపరిచి 2019 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేసి మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు నేరుగా రుణాలు ఇవ్వకుండా సహకార సంఘాల ద్వారా రైతులకు అందే విధంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవోలు శ్రీధర్, మహేశ్, సిబ్బంది జీవరత్నం, ముని, జగదీశ్, ఆయేషా, మస్తాన్, గిరి కుమార్, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆయిల్‌పామ్’ సాగుకు రైతులు మొగ్గుచూపాలి

- జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి



చంద్రగిరి మండలం కల్‌రోడ్‌పల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి

పాకాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంట సాగుకు రైతులు మొగ్గు చూపాలని జిల్లా ఉద్యాన అధికారి బి.దశరథరామిరెడ్డి కోరారు. సోమవారం ఆయన మండలంలోని పదిపుట్లబైలులో రైతులకు ఆయిల్‌పామ్ పంట సాగుపై అవగాహన కల్పించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతిరెడ్డితో కలిసి పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళ్యం, తిరుపతి రూరల్, రేణిగుంట, సత్యవేడు మండలాల పరిధిలో కొన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. వాతావరణ, భూగర్భ జలవనరులు ఆయిల్‌పామ్ పంట సాగుకు ఈ మండలాలు అనుకూలంగా ఉన్నాయని గుర్తించామన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఒక హెక్టారు సాగుకు 143 మొక్కలు అందజేస్తామన్నారు. మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంట సాగుకు, ఎరువులకు ఒక హెక్టారుకు ఏడాదికి రూ.10,500ల చొప్పున రాయితీ అందజేస్తామన్నారు. నీటి పారుదల వున్న రైతులు ఆయిల్‌పామ్ పంట సాగుకు ముందుకు రావాలన్నారు. ఉద్యాన అధికారి, రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారిణి శైలజ తదితరులు పాల్గొన్నారు.

- భాకరాపేట (ఆంధ్రజ్యోతి): మామిడికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని దశరథరామిరెడ్డి చిన్నగొట్టిగల్లు మండలంలో రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు విజయరాయ, తిరుపతిరెడ్డి, ఉద్యాన అధికారి ఆషియా, కుమార్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

# వాహన చోదకులూ.. తస్మాత్ జాగ్రత్త..!



చంద్రగిరి: వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్, పాకాల: హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సుదర్శనప్రసాద్

చంద్రగిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వాహన చోదకులూ.. తస్మాత్ జాగ్రత్త అంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు. చంద్రగిరి మండల పరిధిలో ప్రమాదాల నివారణకు నోహెల్మెట్, నోపెట్రోల్ కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. చంద్రగిరి మండలంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున వాటి నివారణ నిమిత్తం నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా సీఐ వాహనదారులతో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాన్ని నడిపేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని, వాహనచోదకులు నిబంధనలు తప్పక పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులతో కలసి మండలంలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తగినచర్యలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మురళీమోహన్, ప్రవల్లిక, అరుణాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

- పాకాల (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ద్విచక్ర వాహనదారులకు పోలీసులు సోమవారం జరిమానా విధించారు. సీఐ సుదర్శన ప్రసాద్ స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాల డ్రైవింగ్‌లో ప్రాణాలు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణం చేయాలని సూచించారు. వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జ్యోతిరామ్, సిబ్బంది పాల్గొన్నారు.
- రామచంద్రాపురం (ఆంధ్రజ్యోతి): యువకులు రోడ్లపై ర్యాష్‌డ్రైవింగ్ చేస్తే మునుపటిలా రూ.500 కాకుండా ఇప్పుడు రూ.5వేలు అపరాధం విధిస్తున్నామని ఎస్ఐ భక్తవత్సలం పేర్కొన్నారు. సోమవారం ఎస్ఐ మీడియాతో మాట్లాడుతూ గతంలో హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.35 ఉండేదని ప్రస్తుతం రూ.1,035, డ్రైవింగ్ లైసెన్సు లేకపోతే గతంలో రూ.500 ఉండగా ప్రస్తుతం రూ.5వేలు, హెవీ లైసెన్సు లేకపోతే రూ.10వేలు విధించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి నియమాలు అమలు కానున్నాయన్నారు. కఠినచర్యలతో పాటు కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# దివ్యాంగులకు భవిత కేంద్రాలు వరం



చిన్నగొట్టిగల్లులో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న కోఆర్డినేటర్ చంద్రశేఖరరెడ్డి, ఎంఈవో

భాకరాపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు భవిత కేంద్రాలు వరం లాంటివని సహిత విద్యా జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, ఫిజియోథెరపీ, ట్రాన్స్‌పోర్టు అలవెన్సులు, పదో తరగతి పరీక్షా విధానంలో రాయితీల గురించి తెలియజేశారు. దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సత్యనారాయణ, గోపీనాథ్, హెచ్ఎం అమరనాథరెడ్డి, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు వెంకటరమణ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

- ఎర్రావారిపాలెం (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల మేధో శక్తి అద్భుతంగా ఉంటుందని, వారి శక్తిని గుర్తించాలని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఎర్రావారిపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో నిబిడీకృతమైన శక్తిని సమాజానికి ఉపయోగపడేలా మలుచుకోవాలన్నారు. పిల్లలు మండల కేంద్రానికి వచ్చేందుకు రవాణా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంఈవో బాల సుబ్రమణ్యం, ప్రైమరీ మోడల్ స్కూల్ హెచ్ఎం అలీయాస్ బేగం, ఐఈడీ టీచర్లు మధుమతి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.
- చంద్రగిరి (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి దివ్యాంగులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం దివ్యాంగులకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, వివరాలను తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌బాబు, భవిత ఉపాధ్యాయులు శ్యామల, రాజేశ్వరి, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

### దివ్యాంగులను ప్రేమతో ఆదరించండి



మిట్టూరులో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో మార్కొండేయనాయుడు

రామచంద్రాపురం (ఆంధ్రజ్యోతి): వికలత్వం పేరుతో పిలవకుండా దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని ఎంఈవో మార్కొండేయ నాయుడు కోరారు. మిట్టూరు భవిత పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో2 జయవేలు, ఐఈఆర్పీలు మనోహర్, రాజేశ్వరి, లీలారాణి పాల్గొన్నారు.

## కాణిపాక ఆలయ కోనేరు

# ఈశాన్యంలోకి మార్పు

### టీటీడీ సహకారంతో అతిథి గృహం, కల్యాణ మండపాల నిర్మాణానికి ఆమోదం

### ఆలయ బోర్డు సమావేశంలో తీర్మానాలు



ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేతో ఈవో, చైర్మన్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి క్షేత్రంలో వేద పాఠశాల ఏర్పాటు చేయాలని ఆలయ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఆలయ సమావేశ మందిరంలో సోమవారం ధర్మకర్తల మండలి తొలి సమావేశాన్ని ఈవో పెంచలకిషోర్ అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే మురళీమోహన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. టీటీడీ అందజేసిన రూ.25 కోట్లతో అతిధి గృహం,రెండు కల్యాణ మండపాల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి లభించిందని చైర్మన్ మణినాయుడు తెలిపారు.వీటి నిర్మాణ,నిర్వహణ బాధ్యతలు పూర్తిగా వరసిద్ధుడి ఆలయానికే అప్పగించారన్నారు. త్వరలో ఆలయం వద్ద మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్లు ఈవో వివరించారు.ఇందులో తొలి అడుగుగా పుష్కరిణిని రూ.2.80 కోట్లతో ఆలయ ఈశాన్యంలోకి మార్పు చేయనున్నట్లు తెలిపారు. పాత లడ్డూ భవనాన్ని కూల్చివేయాలని తీర్మానించారు. ఆలయంలో నిర్వహించే ఆర్జిత,ఉచిత సేవలపై ఉభయదారులతో చర్చించి నిర్ణయాన్ని వచ్చే సమావేశంలో తీసుకోనున్నట్లు చైర్మన్ తెలిపారు.ఆలయ ప్రచార రథానికి రూ.13 లక్షల వ్యయంతో మరమ్మత్తు చేసి గతంలోలాగా గ్రామాల్లో తిప్పనున్నట్లు తెలిపారు. అలాగే కార్యాలయంలో పనులు వేగవంతం చేయడానికి కొన్ని కంప్యూటర్లు కొనుగోలు చేయాలని ధర్మకర్తల మండలి నిర్ణయించిందన్నారు.ఆలయానికి సమీపంలో ఉన్న వినాయక సదన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఎవరైనా దాతలు రూ.10 లక్షలు చెల్లిస్తే వారికి వినాయక సదన్‌లో ఒక గదిని వారి పేరుపై కేటాయిస్తామన్నారు. బోర్డు సభ్యులు ఊట్ల నాగరాజ నాయుడు,చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ బీవీ.నరేష్,పరిమి చంద్రకళ, కేఎస్ అనసూయమ్మ, సుధాకర రెడ్డి,సునీత, కొత్తపల్లె శివప్రసాద్, శ్రీపతి సతీష్, పెరుమాళ్ల సుబ్బారెడ్డి, చల్లా కృష్ణవేణి, పి.పద్మలత, వసంత, శ్రీవాణి, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ప్రసాద్,. దనంజయ, హరిమాధవరెడ్డి, ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చిరుత పులికి మరో ఆవు బలి

తవణంపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె సమీపంలోని శివకోన అడవిలో చిరుతపులి పాడి ఆవును చంపి తిన్న వైనం సోమవారం వెలుగు చూసింది. బాధితుడు పరదేశి కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఈ రైతు తన పాడి ఆవును ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని శివకోన అడవిలో మేత కోసం వదిలిపెట్టాడు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో అడవిలో వెతికాడు. శివకోనలోని దేవాలయానికి సుమారు కిలో మీటరు దూరంలో ఆవు మృతదేహం బయటపడిందన్నాడు. చిరుత చంపి తిన్నట్లు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఆవు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. సంఘటనా స్థలంలో చిరుతపులి పాదముద్రలను అధికారులు సేకరించారు.

## హుండీ ఆదాయం రూ.78 లక్షలు

చౌడేపల్లె, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ.78.79 లక్షల ఆదాయం చేకూరినట్లు డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ..78,79,574 నగదు, 31 గ్రాముల బంగారు, 770 గ్రాములు వెండి, 5యూరో 2నోట్లు , 10 యూరోల నోటు ఒకటి, 20 యూరో నోటు ఒకటి, యూఎస్ డాలర్ ఒకటి వచ్చింది.

## స్వర్ణరథంపై వరసిద్ధుడు



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయంలో సోమవారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు భక్తుల చేత వైభవంగా నిర్వహింపజేశారు.ఉదయం మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించాక సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు.వేదికపై ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పూజలు నిర్వహించాక భక్తుల ఆధ్వర్యంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు.రాత్రి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు.ఆలయ చైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు,బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 33 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. తిమ్మినాయుడుపాళెంలోని ఎన్ఆర్ఆర్ రెసిడెన్సీ వారు 20 అడుగుల రోడ్డు ఆక్రమించారని, టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని, వర్షానికి పాడైన రోడ్లు మరమ్మతు చేయాలని, పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని తదితర సమస్యలపై వినతులు వచ్చాయి. ఆయా సమస్యలను అధికారులకు పంపి త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఆర్వోలు సేతుమాధవ్, రవి పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవులు దక్కిన నేతలకు సన్మానం



తిరుపతి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) : ఇటీవల నామినేటెడ్ పదవులు దక్కిన కూటమి నేతలను సోమవారం దివంగత కందాటి శంకర్ రెడ్డి నివాసంలో సత్కరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ కొట్టే సాయి, డైరెక్టర్ పగడాల మురళి స్టేట్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్స్ టీడీ వరప్రసాద్, తోట వాసుదేవలను టీడీపీ నేతలు కందాటి సురేష్‌రెడ్డి, జేడబ్ల్యూ విజయకుమార్, జనసేన మధురాయల్, రామచంద్రారెడ్డి, జానకిరామ్, లలితమ్మ, చల్లా, పాతగుంట గిరి, బాలు సత్కరించారు.

## ఘనంగా సంకటహర చతుర్థి వేడుకలు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయక సాగర్ వద్దనున్న సంకల్ప సిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమ వారం సంకటహర చతుర్థి వేడుకలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితుడు సురేష్‌స్వామి, ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, నాదమునిరెడ్డి, సుధాకర్ ఆచారి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, అన్నారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్, శాంతిప్రియ, రత్నజ, కినిషారెడ్డి, తన్విష్ పాల్గొన్నారు.



విశేషాలంకరణలో వినాయకుడు

## కేంద్ర మంత్రికి సన్మానం



తిరుపతి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్‌ను అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌యాదవ్ సోమవారం సన్మానించారు. కపిలతీర్థం రోడ్డులోని తన కార్యాలయానికి వచ్చిన మంత్రిని సన్మానించి, యాదవులకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పట్టణాధ్యక్షుడు వట్టికుంట శంకర్‌నారాయణ, రమేష్‌యాదవ్, కిరణ్‌యాదవ్, చిట్టియాదవ్, సోముయాదవ్, హరి, సురేష్ పాల్గొన్నారు.

## సైన్స్ ఫెస్టివల్లో కిరణ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో కరస్పాండెంట్ జయరామిరెడ్డి

తిరుపతి(విద్య), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రీజనల్ సైన్స్ సెంటర్‌లో 6, 7 తేదీల్లో జరిగిన సైన్స్ ఫెస్టివల్‌లో స్థానిక ఎస్వీ నగర్‌లోని కిరణ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు బహుమతులు గెలుచుకున్నారు. ప్లాస్టిక్ రీసైకిల్ అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని రెడ్డిశ్రుతి మూడవ బహుమతి గెలుచుకుంది. 7వ తరగతి విద్యార్థులు చేతన, శశిప్రియ బయో ఫిల్టర్ ఔట్‌డోర్ పొల్యూషన్ ప్రదర్శనకుగాను నాల్గవ బహుమతి దక్కించుకున్నారు. 5వ తరగతి విద్యార్థులు ప్లాస్టిక్ పొల్యూషన్‌పై ప్రదర్శించిన డ్రామాలో సూర్య బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకున్నారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ జయరామిరెడ్డి విద్యార్థులను అభినందించారు.

## వీధుల్లోనే డ్రైనేజీ నీరు



వీధుల్లో ప్రవహిస్తున్న అండర్ డ్రైనేజీ నీరు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 33వ డివిజన్ అశోక్‌నగర్‌లో అండర్ డ్రైనేజీ నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. రెండు రోజులకొకసారి డ్రైనేజీ పొంగి మురికినీరు వీధుల్లోకి వస్తోంది. స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పలువురు వాహనదారులు జారిపడి ఆస్పత్రి పాలయ్యారు. వీధి మొత్తం దుర్వాసన వెదజల్లుతోంది. దుర్వాసనతో శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## వైకుంఠ ఏకాదశికి స్థానికులకు కోటా కేటాయించండి

తిరుపతి (జీవకోన), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశికి స్థానిక కోటా టిక్కెట్లు కల్పించాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో 5వేలు, మిగిలిన ఎనిమిది రోజుల్లో 2,500 కేటాయించేలా ఈనెల 16న జరిగే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. సామాన్య భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలన్న లక్ష్యంతో ఆన్‌లైన్, లక్కీడిప్ సిస్టంతో పారదర్శకంగా టికెట్లు కేటాయించారని, అయితే ఇందులో చాలామంది స్థానికులకు లభించకపోవడం నిరుత్సాహానికి గురిచేసిందని పేర్కొన్నారు. పునఃపరిశీలించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

## ఏఐటీయూసీ సెమినార్‌ను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో ఈ నెల 16న నిర్వహించనున్న ఏఐటీయూసీ సెమినార్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం గంధమనేని శివయ్య భవన్‌లో ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి, కార్పొరేటర్లకు దోచిపెట్టేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి చేపట్టాల్సిన పోరాటాలపై ఈ సదస్సులో చర్చించి, భవిష్యత్ ప్రణాళికలను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాధాకృష్ణ, శివకుమార్, రవి, నగర నాయకులు అల్లాబక్ష్, బాల తదితరులు పాల్గొన్నారు.

## శ్రామిక్ ఉత్సవ్‌ను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకసాగర్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రామిక్ ఉత్సవ్ సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ అధ్యక్షుడు ఎస్.నారాయణ కోరారు. సోమవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సీఐటీయూ జాతీయ మహాసభల సన్నాహాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో దేశభక్తి గీతాలు, నాటికలు, జానపద కళలు, కార్మిక పాటలు, చెక్కభజన, కోలాటాలు, మిమిక్రీ వంటివి నిర్వహిస్తామని తెలిపారు. పాల్గొనదలచిన కళాకారులు 8919553690, 9398000686లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.నాగార్జున, కమిటీ సభ్యులు ఎస్.విజయలక్ష్మి, డాక్టర్ కె.మునిరత్నం, డాక్టర్ రెడ్డిప్రసాద్, బుజ్జి పాల్గొన్నారు.

## పోలీసు పీజీఆర్ఎస్‌కు 112 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌కు 112 వినతులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ఆయా స్టేషన్లకు పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

## తిరుమలలో రోజా



తిరుమల శ్రీవారిని సోమవారం ఎమ్మెల్యే గణబాబు, మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. **-తిరుమల, ఆంధ్రజ్యోతి**

### ఓపెన్ నేషనల్ తైక్వాండో పోటీల్లో..

## తిరుపతి క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఆదివారం జరిగిన ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తిరుపతి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాలలో పతకాలు సాధించారు. వారిని గ్రాండ్ మాస్టర్ గోపీనాయుడు, కోచ్ సురేష్ అభినందించారు.

**విజేతల వివరాలు..**

- అండర్ 6 విభాగంలో బి.విక్రమ్‌ఆదిత్య క్యైరుగిలో బంగారు, పూంసెలో బ్రాంజ్, జి.సాదిక్ క్యైరుగి, పూంసెలలో బంగారు, వి.పవన్‌కుమార్ క్యైరుగిలో సిల్వర్, పూంసెలో బంగారు.
- అండర్ 8 విభాగంలో పి.డేరన్‌సప్రిత్ క్యైరుగిలో బంగారు, పూంసెలో సిల్వర్, జి.సాషనక్ క్యైరుగిలో బంగారు, పూంసెలో సిల్వర్
- అండర్ 10 విభాగంలో టి.ధరణిప్రియ క్యైరుగిలో బంగారు, పూంసెలో సిల్వర్, పి.లోహిత్ క్యైరుగిలో బంగారు, పూంసెలో సిల్వర్
- అండర్ 12 విభాగంలో ఎన్.నిఖిల్ క్యైరుగి, పూంసెలలో బంగారు
- అండర్ 14 విభాగంలో ఎన్.రిషిక్ క్యైరుగి, పూంసెలలో బంగారు
- అండర్ 17 విభాగంలో టి.చైతన్యకుమార్ క్యైరుగి, పూంసెలలో బంగారు

## ఓవరాల్ చాంపియన్‌గా బాపట్ల వ్యవసాయ కళాశాల

- ముగిసిన వ్యవసాయ వర్సిటీ క్రీడా, సాంస్కృతిక పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం




విజేతలకు బహుమతులు అందజేస్తున్న వెటర్నరీ వర్సిటీ వీసీ రమణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ క్రీడా సాంస్కృతిక పోటీల ఓవరాల్ చాంపియన్‌గా బాపట్ల వ్యవసాయ కళాశాల నిలిచింది. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు సోమవారం ముగిశాయి. ముగింపు సభకు హాజరైన వెటర్నరీ వర్సిటీ వీసీ రమణ విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడా సాంస్కృతిక అంశాల్లోనూ విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ క్రీడా సాంస్కృతిక పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణ, స్టూడెంట్ అఫైర్స్ డీన్ రామచంద్రరావు, అసోసియేట్ డీన్ రెడ్డి శేఖర్, వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ జగపతిరామయ్య, పీడీ రవికాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## వైసీపీ పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయండి

- ఎస్పీకి టీడీపీ నేతల విన్నపం



ఎస్పీ సుబ్బరాయుడిని కలిసి బయటకు వచ్చిన సుగుణమ్మ, టీడీపీ నేతలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని ఏపీబీసీ చైర్‌పర్సన్, టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మ కోరారు. ఈ మేరకు సోమవారం టీడీపీ నేతలతో కలిసి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సుబ్బరాయుడును కలిసి విన్నవించారు. వైసీపీ నేతలు రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేయించారన్నారు. పైగా కుమ్మరితోపు, పోలీసు క్వార్టర్స్‌కు వెళ్లే దారిలో అడ్డంగా గోడ కట్టారని వివరించారు. స్పందించిన ఎస్పీ పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారు. ఎస్పీని కలిసిన వారిలో టీడీపీ నగర అధ్యక్షుడు చిన్నబాబు, రాష్ట్ర నేతలు బుల్లెట్ రమణ, దంపూరు భాస్కరయాదవ్, మునిశేఖర్ రాయల్, పుష్పావతి, బీజీ కృష్ణయాదవ్, కేవీ రమణ, గంగులయ్య, రామ్మూర్తి రాయల్, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, సూర్యకుమారి, విశ్వనాథం తదితరులు ఉన్నారు.

## అటల్ - మోదీ సుపరిపాలన యాత్రను జయప్రదం చేద్దాం : బీజేపీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అటల్ - మోదీ సుపరిపాలన యాత్రను జయప్రదం చేద్దామని బీజేపీ నాయకులు కోరారు. స్థానిక రాఘవేంద్ర నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ యాత్ర ఈనెల 14వ తేదీన తిరుపతి చేరుకుంటుందని తెలిపారు. వాజ్‌పేయి విగ్రహావిష్కరణ ఉంటుందని వివరించారు. బీజేపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ ట్రస్ట్‌బోర్డ్ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేతివృత్తులతో మహిళల ఆర్థికాభివృద్ధి



మహిళలకు కుట్టు శిక్షణ మెటీరియల్ అందిస్తున్న రాస్ డైరెక్టర్ నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళలు చేతివృత్తుల ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చని రాస్ డైరెక్టర్ వి.నాగరాజు అన్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట జనార్దన్ కాలనీలో సోమవారం జనశిక్షణ సంస్థాన్, రాష్ట్రీయ సేవా సమితి సంయుక్తంగా పొదుపు సంఘాల మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మహిళలు ఖాళీ సమయంలో ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, మునిరాజ, నీలమ్మ పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలపై ప్రచారం



ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియం వద్ద సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీ నుంచి తిరుపతిలో ప్రారంభం కానున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలపై ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియం వద్ద ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, యూనివర్సిటీ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో హోరెత్తించారు. మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, వర్సిటీల రాష్ట్ర కోకన్వీనర్ అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరసన్న, వినోద్, నాయకులు గీతాంజలి, భాను, విజయ్ కోరారు.

## అఖండ 2కు విఘ్నాలు తొలగిపోవాలని పూజలు

తిరుపతి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన అఖండ 2 తాండవం సినిమాకు విఘ్నాలు తొలగిపోవాలని ఆయన అభిమానులు సోమవారం ఉదయం అలిపిరి పాదాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. కొబ్బరికాయలు కొట్టారు. ఈ నెల 5న విడుదల కావాల్సిన ఈ సినిమా అనివార్య కారణాలతో వాయిదా పడిన విషయం విదితమే. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు మనోహర్‌రెడ్డి, ఎం.మదన్‌మోహన్, సురేష్, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న బాలకృష్ణ అభిమానులు




ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి -9703618708, 9030367786 9703618705, 9703618710 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

**CHANGE OF NAME**

I, PONNAMREDDI SUREKA RANI, W/o. KOTHAPATI CHANDRA MOULI REDDY (Old Name) R/o D.No. 5-320/10, Flat No.9, Gayathri Nagar, M.R.Palli, TIRUPATI Dt, AP.,INDIA. I Have a changed my name as PONNAMREDDI SUREKHA RANI, W/o. KOTHAPATI CHANDRA MOULI REDDY (New Name).
AJT - 1218

**WANTED**

తిరుపతి ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సూపర్‌వైజర్స్ స్త్రీ, పురుషులు కావలెను. స్థానికులు మాత్రమే. హిందీ మాట్లాడగలగాలి. జీతం : 15,000/-. సంప్ర. : 97031 44467, 68
AJT - 082619

**WANTED**

తిరుపతి విద్యానగర్ నందు శ్రీ సాయి శ్రీనివాస హాస్పిటల్ మరియు మెడికల్స్ షాపు నందు పనిచేయుటకు పురుషులు కావలెను. సంప్ర. : 9441995779, 9441088705
AJT - 082618

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 257599

**పాఠకులకు ముఖ్యగమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడీవీటీ



సాయుధ దళాల పతాక దినోత్సవానికి

## విరివిగా విరాళాలివ్వండి

తిరుచానూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు విరివిగా విరాళాలు అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారంరాత్రి కలెక్టరేట్‌లో ఆయన తన వంతు సాయంగా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమాధికారి కేవీ రాఘవులు, మాజీ సైనిక సంఘ ప్రతినిధులు మనోహర్‌రెడ్డి, ఆనందరెడ్డి, కేశవ, జయప్రకాష్‌రెడ్డి, జయప్రకాష్, వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళమిస్తున్న కలెక్టర్

## నేటి ఎస్వీ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల రద్దు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో మంగళవారం నిర్వహించాల్సిన డిగ్రీ 3, 5వ సెమిస్టర్‌తో పాటు డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు రద్దయ్యాయి. సాంకేతిక కారణాలతో ఈ పరీక్షలను రద్దు చేసినట్లు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు, పరీక్షా కేంద్రాలకు ఎస్వీయూ పరీక్షల విభాగం సమాచారాన్ని పంపింది. బుధవారం నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా ఉంటాయని సీఈ రాజమాణిక్యం తెలిపారు.


### సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**శనివారం హుండీ ఆదాయం: రూ.3.69 కోట్లు**

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,343**

**తలనీలాలు సమర్పించినవారు: 26,505**





# పీజీఆర్‌ఎస్‌లో భూ సమస్యలే ఎక్కువ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. ముఖ్యంగా పింఛన్లు అందలేదని, ఇంటి పట్టాలకు స్థలం చూపలేదని, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని, సంక్షేమ పథకాలు అందలేదని.. ఇలా వివిధ సమస్యలపై 308 అర్జీలు వచ్చాయి. అందులో భూ సమస్యలపైనే 184 ఉన్నాయి. అర్జీదారుల సమస్యలను విన్న కలెక్టర్ వెంకటేశ్వర్.. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి జవాబు ఇవ్వాలని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

### పరిహారం ఇవ్వండి



సూళ్లూరుపేట మండలం ఎర్రబాళెం గ్రామసర్వేలో వంద అంకణాలకుపైగా మా భూమి పోర్టుకట్టకు పోయింది. మిగిలిన భూమి హైవేకు పోయింది. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. భూమి లేకపోవడంతో కుటుంబ పోషణకష్టంగా మారింది.మీరైనా ఆదుకోండి.

- బాలమురళీకృష్ణ, దివ్యాంగుడు, సూళ్లూరుపేట

### పొలానికి దారి కల్పించండి



అయ్యా.. నాకు చంద్రగిరి మండలం భీమవరం రెవెన్యూ లెక్కదాఖల్లో 56సెంట్ల భూమి ఉంది. అక్కడికి వెళ్లే దారిని కొందరు ఆక్రమించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మా పొలాలకు హద్దులు చూపడంలేదు. మీరైనా కనికరించి హద్దులు చూపించండి.

- చల్లా రవి, కందులవారిపల్లి చంద్రగిరి మండలం

### వికలత్వ సర్టిఫికెట్ మంజూరు చేయండి



మా అబ్బాయి గోవర్ధన్‌కు రెండేళ్ల క్రితం నరాల బలహీనత ఏర్పడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం కనిపించడం లేదు. మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాయాల్సి ఉంది. డిజేబులిటీ సర్టిఫికెట్ మంజూరు చేయాలి.

- నాదముని, తొండవాడ, చంద్రగిరి మండలం





నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు - ఆందోళన చేస్తున్న అఖిల భారతీయ జనసంఘ్ నాయకులు

### ఇళ్లస్థలాలు మంజూరు చేయండి

వేదాంతపురం పంచాయతీ రాందాసు కాలనీలోని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ కోరారు. ఈ మేరకు కాలనీ వాసులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. గత ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి స్థలం చూపించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో భూకబ్జాలను ప్రోత్సహించే అధికారులను కఠినంగా శిక్షించాలని అఖిల భారతీయ జనసంఘ్ నేతలు సుధాకర్ చౌదరి, రమణారెడ్డి, విజయశంకర్, రాజేంద్రప్రసాద్ తదితరులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

### మూడు చక్రాల వాహనం మంజూరు చేయండి

వికలత్వం కారణంగా వీల్‌చైర్‌కే పరిమితమయ్యాం. హోటల్‌లో కార్మికులుగా పనిచేస్తున్నాం. వికలత్వ కోటాలో మూడు చక్రాల మోటారు వాహనాన్ని మంజూరు చేసి ఆదుకోండి.

- జయశంకర్, జన్‌సుందర్‌రాజు, మదనంబేడు, సత్యవేడు



## సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- డయల్ యువర్ సీఎండీకి 70 వినతులు



విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చూపకుండా చర్యలు చేపట్టాలని సీఎండీ శివశంకర్ ఆదేశించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ సదరన్ డిస్కం సీఎండీ' కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజ్ సమస్య, వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరులో జాప్యం, కాలిపోయి, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మార్చాలి, విద్యుత్ లైన్లు మార్పు చేయాలంటూ.. వివిధ సమస్యలపై 70 వినతులు వచ్చాయన్నారు. వీటిలో కర్నూలు నుంచి 18, కడప 13, అనంతపురం 15, నెల్లూరు 3, శ్రీసత్యసాయి3, చిత్తూరు1, తిరుపతి11, నంద్యాల 6 చొప్పున ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తెస్తే ప్రాధాన్యమిచ్చి పరిష్కరిస్తామని చెప్పారు. టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333 కి కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎస్.శోభావాలంటీనా, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, ఎం.కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్ పాల్గొన్నారు.

### ఈతకెళ్లి యువకుడి మృతి



ఈశ్వరయ్య(ఫైల్‌ఫొటో)

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపాళెంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గొల్లపాళెం గ్రామానికి చెందిన విన్నమాల ఈశ్వరయ్య(37) సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో మహాలక్ష్మమ్మ దేవాలయం పక్కన ఉన్న గుంటలో ఈత కొట్టేందుకు దిగాడు. బయటకు రాకపోవడంతో స్థానికులు గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని బాలిరెడ్డిపాళెం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

### హామీ అమలు చేసేవరకు పోరాటం



విద్యాసంస్థల బంద్ పోస్టర్లను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలు చేసేవరకు శాంతియుతంగా పోరాటం సాగిస్తామని జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రెండో రోజు రిలే దీక్ష నిర్వహించారు. సీపీఐ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దీక్షకు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల ప్రజలు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులను గుర్తించిన చంద్రబాబునాయుడు, లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, తీరా జిల్లాల పునర్విభజనలో తుది ముసాయిదాలో ఈ అంశాన్ని చేర్చకపోవడంతో అన్యాయమన్నారు. గూడూరును నెల్లూరులో కలపాలని, లేనిపక్షంలో జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో ఈ నెల 10వ తేదీన జేఏసీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, పవన్‌కుమార్, బాలకృష్ణంరాజు, శంకర్‌రెడ్డి, ప్రభాకర్, మనోజ్‌కుమార్, శశికుమార్, సునీల్ కుమార్, మణి, చంద్రమోహన్, నిరంజన్‌రెడ్డి, విజయ్‌కుమార్, మల్లికార్జున, శరత్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళమిచ్చిన దాతలు

తిరుమల, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన భక్తవత్సలం, పీ చిరదీప్ కృష్ణ, ఉమా మహేశ్వరి ఈ విరాళాన్ని ఆదివారం తిరుమలలోని దాతల విభాగంలో వారు అందజేశారు.

దామానెల్లూరు సచివాలయ

### ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామానెల్లూరు సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు ఎంపీడీవో మురళీకృష్ణ ఎట్టకేలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత నెల 30న తుఫాన్ సమయంలో సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో ఆ గ్రామ పరిశీలనకు వెళ్లగా ఈ విషయం బటయపడింది. దీనిపై ఈనెల 1వ తేదీన 'విపత్తు వేళా.. విధుల్లో ఉండరే!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం అయింది. దీంతో జిల్లా అధికారులు ఆరా తీసి చర్యలకు ఆదేశించారు. అయితే మండలస్థాయి అధికారులు మీనమేషాలు లెక్కించడంతో జిల్లా అధికారులు మరోమారు ఎంపీడీవోను హెచ్చరించడంతో పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ సిబ్బందికి సోమవారం సాయంత్రం వాట్సప్ గ్రూపులో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే సోమవారం 8వ తేదీ షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, ఈ నెల 3వ తేదీ ఇచ్చినట్లు పేర్కొనడం గమనార్హం. అందులోనూ ఐదు రోజుల ముందు తేదీ వేసి రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

## పోలీసు స్టేషన్లకు యువ ఎస్‌ఐలు





తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్లకు యువ ఎస్‌ఐలు వచ్చారు. 30 మంది పీఎస్‌ఐలను వివిధ స్టేషన్లకు పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎస్‌ఐలుగా పనిచేసిన కొందరిని వీఆర్‌కు, స్పెషల్ బ్రాంచ్‌కు, డీసీఆర్‌బీకి నియమించారు. తిరుపతిలో ఈస్ట్ పోలీసు స్టేషన్‌కున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ముగ్గురు ఎస్‌ఐలను నియమించారు. వడమాలపేటకు ధర్మారెడ్డి స్థానంలో నూతన ఎస్‌ఐను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. కాగా, యువ ఎస్‌ఐలు సోమవారం ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ వారికి సూచించారు. పోలీసు శాఖ ప్రతిష్టతను ప్రజల్లో ఇనుమడింపచేయాలని ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమాజంలో అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని అన్నారు.

### 16 నుంచి దేశమంతా తిరుప్పావై ప్రవచనాలు

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. ఏపీలో 76, తెలంగాణ 57, తమిళనాడు 73, కర్ణాటక 21, పుదుచ్చేరి 4, న్యూఢిల్లీ, ఒడిశాల్లో ఒక్కో కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తారు. ఇక, తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కేటీ రోడ్డులోని వరదరాజస్వామి ఆలయంలోనూ తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు.

### పార్లమెంటులో ఎంపీ వాయిదా తీర్మానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంస్కృత వర్సిటీ ఘటనపై లోక్‌సభలో తిరుపతి ఎంపీ గురుమూర్తి సోమవారం అడ్జర్నమెంట్ మోషన్ నోటీసు ఇచ్చారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాల్సిన గురువులే ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడటం తిరుపతి ప్రతిష్టను దెబ్బతీస్తోందన్నారు. వెంటనే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**విద్యార్థి సంఘాల ఆందోళన**

సంస్కృత వర్సిటీలో విద్యార్థి సంఘాలు సోమవారం ఆందోళన చేపట్టాయి. వీరిని గేటు వద్దే పోలీసులు అడ్డుకోగా.. అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. లైంగిక వేధింపుల ఘటనలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లక్ష్మణ్ కుమార్, శేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. బాధ్యులను ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులైనా అధికారులు ఎందుకు గుట్టుగా ఉంచారని ప్రశ్నించారు. విద్యార్థి సంఘ నేతలు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సుందర్ రాజు, శివకుమార్, స్వరూప్ కుమార్, యశ్వంత్ రెడ్డి, వినోద్ కుమార్, చెంగల్రెడ్డి, రఫీ, ప్రదీప్ కుమార్, భాస్కర్‌యాదవ్, విజయ్, వినోద్ కుమార్, నాగేశ్వరరావు, హరినాయక్, తిరువర్ధన్ రెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై సదస్సు






సదస్సులో మాట్లాడుతున్న కృష్ణయ్య

సత్యవేడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై ఉన్నత స్థాయి సమావేశం సోమవారం శ్రీసిటీలో జరిగింది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆ శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలన్న రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలపై చర్చించారు. పి.కృష్ణయ్య, ఇతర ప్రతినిధులకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్, శ్రీసిటీ అమలు చేస్తున్న రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్(3ఆర్) విధానాల ప్రాధాన్యతను, నిబద్ధతను వివరించారు. ప్రత్యేకించి శ్రీసిటీ జీరో వ్యర్థలక్ష్యాలను ప్రస్తావిస్తూ.. స్క్రాప్ పోర్టల్‌ను వినియోగించుకుని శ్రీసిటీ ప్రాంతంలో 3ఆర్ పద్ధతులను మరింత బలోపేతం చేయాలంటూ పరిశ్రమ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. శ్రీసిటీ సుస్థిర పర్యావరణ హిత కార్యక్రమాలను ప్రశంసించిన కృష్ణయ్య, ఈతరహా ఏకో సిస్టమ్‌ని అభివృద్ధి చేయడంలో ఇతర పారిశ్రామిక కేంద్రాలకు శ్రీసిటీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, పారిశ్రామిక ఉప ఉత్పత్తులను రీసైకిల్, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యుత్తమ పద్ధతులుగా పేర్కొన్న ఆయన, వ్యర్థ నిర్వహణ ఏజెన్సీలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. జీవ వైవిధ్య పరిరక్షణ, పచ్చదనం పెంపును శ్రీసిటీ పరిశ్రమలు బాధ్యతగా స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీసిటీ సుస్థిరత ప్రణాళికను ప్రస్తావిస్తూ భవిష్యత్తుకు 3ఆర్ పద్ధతులు అనివార్యమని ఉద్ఘాటించారు. ఉపాధిసృష్టి, కాలుష్యనియంత్రణ మధ్య సమతుల్యతను పరిశ్రమలు పాటించాలని, ఇందుకోసం రెగ్యులర్ ఆడిట్లు, పర్యవేక్షణ అవసరమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని వివరిస్తూ సర్క్యులర్ పార్కులు, 3ఆర్ సెంటర్లు, ప్లాస్టిక్ నిషేధం, చెత్త నిర్మూలన, ఎంఎస్ఎంఈలకు అవకాశాలు వంటి పలు కార్యక్రమాలు ఇందులో భాగంగా పేర్కొన్నారు. ఈ విధానం 2025 ఆగస్టులో రాష్ట్ర కేబినెట్ ఆమోదం పొందిందన్నారు. అన్ని రంగాల్లో 3ఆర్ సూత్రాల ప్రాతిపదికగా వ్యర్థాలను వనరులుగా మార్చి అమలు చేయడం ఈ విధానం లక్ష్యంగా వివరించారు. తన సందేశంలో ఏపీపీసీబీ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల పునర్వినియోగంపై సమగ్ర విధానాన్ని రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టిని, నాయకత్వాన్ని కొనియాడారు. సర్క్యులర్ ఎకానమీ సూత్రాల ఆచరణ, సుస్థిర పారిశ్రామిక ప్రగతి అంశాలలో శ్రీసిటీ కీలకపాత్ర పోషిస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ సభ్యుడు నాగేశ్వరరాజు, సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్‌తో పాటు ఆ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల నుంచి వంద మందికిపైగా మానవ వనరులు, పర్యావరణం, ఆరోగ్య, భద్రత మేనేజర్లు హాజరయ్యారు. సమావేశంలో వివిధ సమస్యలు, ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాల శుద్ధి వంటి అంశాలపై చురుకైన చర్చలు సాగాయి.

## వైకుంఠ ఏకాదశికి సమన్వయంతో పనిచేయాలి



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతిలోని కమాండ్ కంట్రోలు యూనిట్‌లో సోమవారం ఆయన జిల్లాలోని పోలీసు అధికారులతో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై ముందస్తు సమావేశం నిర్వహించారు. తిరుమలకు భారీగా వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, లైన్ మేనేజ్‌మెంటు, అత్యవసర స్పందన బృందాల నియామకం, పాదచారి మార్గాల భద్రత వంటి అంశాలపై చర్చించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా ప్రత్యేక హెల్ప్ డెస్కులు, చైల్డ్ మిస్సింగ్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

## పుష్కరిణి.. పులకింత

### ఆహ్లాదకంగా గడుపుతున్న ప్రజలు





వైష్ణవ కోనేరులో రంగు చేపలకు ఆహారం వేస్తున్న చిన్నారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని కోనేర్లు నిండు జలాలతో కళకళలాడుతున్నాయి. పుష్కరిణిల వద్ద భక్తులు, స్థానికులు ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని భరద్వాజతీర్థం కోనేరులో ఇటీవల కురిసిన వర్షాలతో నిండుగా నీరు చేరింది. ఇక్కడ పచ్చని చెట్లు, ఉద్యానవనంగా సేద తీరే పరిసరాలతో పాటు నీటిపై సంచరించే బాతులు ఆకర్షిస్తున్నాయి. ముక్కంటి ఆలయానికి విచ్చేసే భక్తులతోపాటు స్థానికులు సాయంత్రం వేళ సరదాగా భరద్వాజ తీర్థం వద్దకు చేరుకుని ఉల్లాసంగా గడుపుతున్నారు.

**భారీ రంగు చేపలు**

శ్రీకాళహస్తి పట్టణం జయరామరావువీధిలోని వైష్ణవ పుష్కరిణిలో భారీ రంగుచేపలు పిల్లలు, పెద్దలను మైమరిపిస్తున్నాయి. వర్షాలకు పుష్కరణి నిండుగా మారడంతో సాయంత్రం వేళ చేపలకు ఆహారం వేసేందుకు పిల్లలు, పెద్దలు పుష్కరిణి వద్దకు చేరుకుని పులకిస్తున్నారు. ఐదేళ్ల కిందట కోనేరు ఎదురుగా ఉన్న ఓ అక్వేరియం షాపు నిర్వాహకుడు రంగు చేపలను పుష్కరిణిలో వదిలారు. అవి పెరుగుతూ వాటి సంతతిని వృద్ధి చేశాయి. దాంతో ఎక్కడా లేని విధంగా ఈ కోనేరులో వర్షాకాలంలో భారీ రంగు చేపలు గోల్డ్‌ఫిష్, వైట్, బ్లాక్ చేపలు ఆకర్షిస్తున్నాయి. ఇక, నారదపుష్కరణి కూడా నిండుకుండలా కనువిందుచేస్తోంది. ఉదయం, సాయంత్రం కోనేరులో స్థానికులు సేద తీరుతున్నారు.





భరద్వాజతీర్థం వద్ద సందడిగా..

## రైతుల అభ్యున్నతికి ప్రాధాన్యం



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు లభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం పులివేంద్ర వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ అధ్యక్షతన నూతన కార్యవర్గ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నెలవల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరకు లభిస్తున్నాయని చెప్పారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ కార్యదర్శి రావమ్మ, వైస్ చైర్మన్ రవీంద్రారెడ్డి, మాజీ చైర్మన్ తిరుమూరు సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు సెల్వం, పళణి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఏఎంసీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

## రైతులను ఆదుకోండి



తహసీల్దార్ హరికృష్ణతో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పైర్లు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి కోరారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి, వ్యవసాధికారి విజయభారతిలకు వినతిపత్రం అందజేశారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు చెందిన వరి నారుమడులు, పైర్లు నష్టంతో పాటు పొలచ్చూరు దళితవాడలో ఇళ్లు కూలాయని అధికారులకు వివరించారు. ఇంకా పొలాల్లో వర్షపునీరు నిలిచి ఉందని, రహదారులు దెబ్బతిన్నాయని, యాలకారికండ్రిగ ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి నష్టాలపై నివేదించి బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రామకృష్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి పాఠశాల బస్సు నడిపిన డ్రైవర్

### పోలీసులకు అప్పగించిన స్థానికులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలకు చెందిన బస్సును డ్రైవర్ మద్యం తాగి నడుపుతూ గడియారం సెంటర్‌లోని పోలేరమ్మ ఆలయం ఎదుట ఉన్న టేబుల్‌ను ఢీకొట్టాడు. అదే సమయంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టబోగా వారు తప్పించుకున్నారు. గమనించిన స్థానికులు మద్యం తాగి బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. పోలీసులు బస్సును స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థులను మరో బస్సులో పాఠశాలకు తరలించారు.

## టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో మునిరత్నం

నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో మునిరత్నం అన్నారు. సోమవారం నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వంద రోజుల విద్యాభ్యాసం యాక్షన్ ప్లాన్‌ను తెలియజేశారు. ఏఎంవో చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులు ఆందోళన చెందవద్దని, 100 రోజుల యాక్షన్ ప్లాన్ పాటిస్తే వందశాతం ఉత్తీర్ణత సాధ్యమవుతుందన్నారు. వారి వెంట హెచ్‌ఎం మంజుల ఉన్నారు.

## జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి లోకేష్‌ను, కోచ్ శివశంకర్‌ను అభినందిస్తున్న శ్రీనివాసులురెడ్డి

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సబ్‌జూనియర్స్ ఆర్చరీ పోటీల్లో లయోలా జూనియర్ కళాశాల విద్యార్థి వెంకటలోకేష్ ప్రతిభ చాటారని కరస్పాండెంట్ పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థి వెంటకలోకేష్‌ను, కోచ్ శివశంకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ అరుణాచల్‌ప్రదేశ్‌లో గత నెలలో నిర్వహించిన సబ్‌జూనియర్స్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో వెంకటలోకేష్ ప్రతిభచాటి సిల్వర్ మెడల్ సాధించాడన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజనారాయణ, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



కోఆపరేటివ్ బ్యాంక్ వద్ద సహకార సంఘాల ఉద్యోగుల ఆందోళన

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని సహకార సంఘాల ఉద్యోగులు హెచ్చరించారు. సోమవారం కోటలోని సహకార బ్యాంక్ వద్ద నిరసన తెలిపారు. మండలంలోని తిన్నెలపూడి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, సిద్దవరం, చిట్టేడు, ఊనుగుంటపాళెం సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరండి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని అర్బన్ సీఐ బాబి అన్నారు. నాయు డుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలో సోమవారం ఉదయం పరిశ్రమలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆదిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు ఢీకొని ఒకరికి గాయాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణంలోని కోళ్లమిట్ట ప్రాంతానికి చెందిన వంజువాకం బాబు ఫోన్‌లో మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న రైల్వేగేటు దాటుతుండగా రైలు ఢీకొంది. గాయపడిన బాబును 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గూడూరుకు తీసుకెళ్లారు.

## ఆటో చోరీ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం రాత్రి ఇంటి ముందు ఆటో పార్కింగ్ చేశానని, సోమవారం ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదని, పరిసర ప్రాంతాల్లో గాలించి ఆచూకీ లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

## భూవివాదంలో ఒకరిపై కేసు

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నపాళెం గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో అన్నదమ్ముల మధ్య భూమి పంపకాల విషయంలో సోమవారం వివాదం జరిగింది. తమ్ముడుపై అన్న దాడిచేయడంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు అన్న మల్లికార్జున్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిఖిల్ తెలిపారు.

# తారురోడ్డుపై సిమెంట్‌తో అతుకులు

### కంకర తేలడంతో నరకంగా ప్రయాణం - అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు



కంకర తేలడంతో అధ్వానంగా ఉన్న శ్రీహరికోట రోడ్డు

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే షార్ రోడ్డు అధ్వానంగా మారింది. పట్టణంలోని షార్ వై జంక్షన్ నుంచి ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలెం వరకు రోడ్డు గోతులు ఏర్పడి రాళ్లు తేలడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నపాటి వర్షమొచ్చినా అంబేడ్కర్ గురుకులం నుంచి సాయిబాబ ఆలయం వరకు రోడ్డుపై మోకాటి లోతు నీరు నిలబడుతోంది. గతంలో బీటీ రోడ్డుకు సిమెంట్‌తో అతుకులు వేసి గుంతలను పూడ్చారు. ఆ సిమెంట్ లేచిపోవడంతో మళ్లీ గోతులు ఏర్పడి ప్రయాణం నరకంగా మారింది. మొంథా, దిత్వా తుపాన్లతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై సన్నని కంకర లేయడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి అయ్యి ప్రమాదాలకు గురవుతున్నారు. రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన సామగ్రి, ఉపగ్రహాలు, లిక్విడ్‌లను తీసుకెళ్లే భారీ వాహనాలు ఈ రోడ్డులో షార్‌కు వెళ్తుంటాయి. రోడ్డు అధ్వానంగా ఉండడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో ఇబ్బందులు తప్పడంలేదు. దీనికి తోడు కేఆర్‌పాలెం వద్ద షార్ ఉద్యోగులకు నివాసాల నిర్మాణం జరుగుతోంది. అదే విధంగా షార్ బస్సు గ్యారేజ్ వద్ద మరో ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలకు రాళ్లు, సిమెంట్, ఇతర సామగ్రిని తరలిస్తున్న భారీ వాహనాలు పలు సందర్భాల్లో రోడ్డు పక్కకు ఒరిగిపోయిన ఘటనలు ఉన్నాయి. వారం రోజుల క్రితం ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయి స్కూటరిస్టుకు చెయ్యి విరిగింది. రెండు రోజుల క్రితం ఓ మహిళా స్కూటీలో వెళ్తూ గోతిలో ఇరుక్కుపోయింది. ఇలా తరచూద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడిపోవడం పరిపాటిగా మారిపోయింది. షార్ యాజమాన్యం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.





ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కర్పూరజ్యోతి జ్వాలలు - అయ్యప్పస్వామి దీపోత్సవంలో మహిళలు

# అంబరాన్నంటిన అయ్యప్పస్వామి జ్యోతి పూజోత్సవం



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు

నాయుడుపేట/టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని పార్కు ప్రాంగణంలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి జ్యోతి పూజోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ గణపతిహోమం నిర్వహించారు. శబరిమలై తరహాలో అయ్యప్పస్వామి దేవాలయాన్ని రూపొందించి స్వామివారిని కొలువుదీర్చారు. అయ్యప్ప పడి మెట్ల వద్ద వెయ్యి కిలోల కర్పూర గడ్డలను అఖండ జ్యోతికి సిద్ధం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, రఫీ అఖండజ్యోతి ప్రజ్వలనం చేశారు. దేదీప్యమానంగా వెలుగుతున్న అఖండ కర్పూరజ్యోతి జ్వాలలను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అయ్యప్పస్వామికి నగరోత్సవం నిర్వహించారు. మహిళలు దీపాలతో హారతుపడుతూ నగరోత్సవంలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం జనసంద్రమైంది. ఈ కార్యక్రమంలో గురుస్వామి ప్రతాప్, అయ్యప్పస్వామి సేవాసంఘం సభ్యులు వెంకటకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, అంకయ్య, మునిరాజ, సుబ్రమణి, జలంధర్, చదలవాడ కుమార్, చిరువెళ్ల మునిరాజ, కనమర్లపూడి సుబ్రమణి, శ్రీనివాసులు, గాదిరెడ్డి గోపి, కిషోర్‌బాబు, పార్థసారధి, సంజయ్, నిత్యకృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, ధనంజయ, నారాయణ, రవి, చంద్రశేఖర్‌రెడ్డి, ఏతేంద్ర, మైలారి రాజశేఖర్, జీవీఆర్ నాయుడు, చెంచయ్య, చెంచుకృష్ణయ్య, సుబ్బారావు, అమరేంద్ర, అత్తికాయల సుబ్రహ్మణ్యం, అవధానం సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని 23వ వార్డు కొండమిట్టలో నివాసం ఉంటున్న అంజూరు జయమ్మ సోమవారం ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ముక్కంటి పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలోమురళియాదవ్, పఠాన్ ఫరీద్, ఉత్తరాజి శరవణకుమార్, శ్రీవారి సురేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టండి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గిన నేపథ్యంలో ప్రతి పంచాయతీలో పారిశుధ్య చర్యలు చేట్టాలని డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల కురిసిన వర్షాలతో పారిశుధ్యం అధ్వానంగా మారిందన్నారు. అలాగే ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపరిచి కోర్లినేషన్ చేయాలన్నారు.

## రత్నమ్మ పెద్దకర్మకు హాజరైన ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తల్లి చింతకుంట రత్నమ్మ ఇటీవల మరణించారు. సోమవారం కడప జిల్లా పోట్ల దుర్తిలో పెద్దకర్మ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## ట్రాక్టర్, స్కూటర్ ఢీ: పోస్ట్‌మన్‌కు తీవ్రగాయాలు

ఏర్పేడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, స్కూటర్ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న మేర్లపాక పోస్ట్‌మన్‌కు తీవ్రగాయాలయ్యాయి. మేర్లపాక దళితవాడకు చెందిన శంకరయ్య మేర్లపాక పోస్ట్‌మన్‌గా పనిచేస్తుంటారు. సోమవారం సాయంత్రం సొంత పనుల నిమిత్తం ఏర్పేడుకు వచ్చి తిరుగు ప్రయాణంలో హెచ్‌పీ గ్యాస్ సమీపంలో ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శంకరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

## భూసారం ఆధారంగా వ్యవసాయం

పిచ్చాటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కల్పించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. భూసారపరీక్ష, పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా సాగు ఖర్చు తగ్గుతాయన్నారు. ఏవో సంజీవరెడ్డి మాట్లాడుతూ... రైతు సేవా కేంద్రాల నుంచి తమ భూసార పరీక్ష ఫలితాల కార్డులను తీసుకుని వాటి ఆధారంగా సాగు చేయాలని సూచించారు.

**సత్యవేడు (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఆత్మ కార్యాలయంలో ఏవో మురళి ఆధ్వర్యంలో మండలంలోని రైతులకు భూసారపరీక్షలపై అవగాహన కల్పించారు. ఏడీఏ సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నో హెల్మెట్... నో పర్మిషన్

నాగలాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రజల్లో చైతన్యం పెంచడం కోసం రాష్ట్ర సరిహద్దుల వద్ద పోలీసులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో నాగలాపురం మండలం తమిళనాడు సరిహద్దులోని సురుటుపల్లి చెక్‌పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ సునీల్ ఆధ్వర్యంలో తమిళనాడు నుంచి హెల్మెట్ ధరించకుండా వచ్చిన ద్విచక్రవాహనాలను వెనక్కి పంపించారు.

## కంటి వైద్య శిబిరం

నాగలాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ గ్రామీణ బ్యాంకులో సోమవారం కంటి వైద్య ఉచిత శిబిరం జరిగింది. డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 65 మందికి పరీక్షలు చేయగా 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. బ్యాంకు మేనేజర్ సంతోష్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

బాలాయపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యమైంది. బాలాయపల్లి మండలం అలిమిలి గ్రామానికి చెందిన పొట్టేళ్ల శీనయ్య, వెంకటరమణమ్మ దంపతుల కుమారుడు ప్రసన్నకుమార్(32) గత నెల 30 నుంచి కపించకుండాపోయాడు. ఈ నెల 3న శీనయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గ్రామంలోని కొందరు యువకులతో కలిసి ప్రసన్నకుమార్ ఈతకు వెళ్లాడని తెలియడంతో కైవల్యానది వెంబడి గాలించారు. సోమవారం నిండలి సమీపాన కైవల్యానది బ్రిడ్జి వద్ద మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## అంబేడ్కర్ భవనం కోసమే కంచె

వెంకటగిరి, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిపేట సర్వే నంబర్ 217లోని ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, ఇందు కోసమే కంచె వేశామని బహుజన సంఘాల నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కంచె వేశారంటూ ఈనెల 5వ తేదీ ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు సోమవారం కంచె తొలగించనున్నారని తెలుసుకున్న బహుజన సంఘాల నేతలు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. సదరు స్థలాన్ని అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించాలని కలెక్టర్‌ను కోరామని, ఈ నేపథ్యంలో కంచె వేసి కాపాడుకుంటూ వస్తున్నామని చెప్పారు. కంచె తొలగిస్తే బహుజనులంతా ఒక్కటై అడ్డుకుంటామని బహుజన సంఘాల నేతలు స్పష్టం చేశారు.

## కౌలు రైతుపై దౌర్జన్యం

### పోలీసులకు ఫిర్యాదు

ఓజిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సగుటూరుకు చెందిన కౌలు రైతు కలపాటి వేణుపై అదేగ్రామానికి చెందిన కురుగొండ సురేష్, సుబాషిని దౌర్జన్యం చేసినట్లు బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు వివరాలు... సగుటూరుకు చెందిన కురుగొండ మంజులమ్మకు చెందిన 3.60 ఎకరాల పొలాన్ని వేణు కౌలుకు తీసుకున్నాడు. దుక్కి చేసి నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకున్నాడు. ఈ క్రమంలో సురేష్, సుబాషి పొలం పనులను అడ్డుకున్నారు. ప్రశ్నించిన వేణును దూషించడమే కాకుండా దౌర్జన్యం చేసి భయపెట్టారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు.

## మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలు చెల్లించండి

నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు నాలుగు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు సీఐటీయూ నేత శివకవి ముకుందతో కలసి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, పారిశుధ్య పరికరాలు అందజేయాలన్నారు. అలాగే కార్మికులు గతంలో 17 రోజులు సమ్మె చేశారని, ఆ సమయంలో వేతనాలు కూడా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణమ్మ, అంకయ్య, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, సాయి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నభోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి శివకవి ముకుంద అన్నారు. సోమవారం నాయుడుపేటలోని విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి విజయమ్మ మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ నాయకులు వాణి, రజియా, మల్లిక, చంద్రమ్మ, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ అర్జీలకు ప్రాధాన్యం

డక్కిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజావిజ్ఞప్తుల దినంలో అందే అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావిజ్ఞప్తుల దినంలో ఎక్కువగా భూ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు వివరించారు. ప్రజలు విన్నవించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో మాధవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్సు సర్వీసులు నడపాలని ప్రయాణికుల నిరసన

కోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కోట - ముత్తుకూరు బస్సు సర్వీసులను యథావిధిగా నడపాలంటూ కోట ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ప్రయాణికులు నిరసన తెలిపారు. వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులను కోట బస్టాండ్ నుంచి ఉదయం 8 గంటల నుంచి రాత్రి పొద్దుయేవరకు ముత్తుకూరు, నెల్లూరువైపు సర్వీ సులు నడుపుతుంటారు. ఇవి ఉద్యోగులు, విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. అయితే ఇటీవల నుంచి ఆర్టీసీ అధికారులు కోట, ముత్తుకూరు సర్వీసులు సక్రమంగా నడవటం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

## సచివాలయంలో తనిఖీలు

కోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి సచివాలయాన్ని గ్రామవార్డు, సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో అల్లిబాషా సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రియాజ్‌ఉద్దీన్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

## రోడ్డుపై కూలిన చెట్టు



కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వీరారెడ్డిసత్రం, వెంకన్నపాళెం గ్రామాల మార్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై సోమవారం ఓ చెట్టు కూలిపోయింది. కోట నుంచి వాకాడుకు వెళ్తున్న విద్యుత్ మెయిన్ లైన్‌పై చెట్టు పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డుపై చెట్టు కూలిపోవడంతో రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్ అయింది. విద్యుత్ అధికారులు చెట్టును పక్కకు తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

## శానిటేషన్ సిబ్బందికి దుస్తుల పంపిణీ

నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్‌కుమార్ తన తల్లి రమణమ్మ తృతీయ వర్ధంతి సందర్భంగా సోమవారం దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మూడు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ఎంఈవోలు సునీలా, శీనయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

## అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం గ్రామానికి చెందిన రైతు గురుప్రసాద్(45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గురుప్రసాద్‌కు పండ్లూరు సమీపంలో ఉన్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. సోమవారం ఉదయం సమీపంలోని ఓ కాలువలో గురుప్రసాద్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని నాయుడు పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కౌశల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. కాగా, ఆదివారం కాలువపై తూము వద్ద గురుప్రసాదం కూర్చొని ఉండగా గమనించినట్లు స్థానికులు చెబుతున్నారు.

## రాచపాళెం చెరువులో గుర్తుతెలియని మృతదేహం

ఓజిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాచపాళెం చెరువులో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెరువులో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో అక్కడకు వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడికి సుమారుగా 35 ఏళ్లు ఉంటాయని, చేతిపై తమిళభాషలో పచ్చబొట్టు ఉందని, మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## బాలకార్మికులను విద్యావంతులను చేయాలి

నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలకార్మికులను గుర్తించి వారిని విద్యావంతులు చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వాసప్ప అన్నారు. సోమవారం బాలకార్మికుల నిర్మూలనపై ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు గ్రామంలో ప్రతి ఇంటినీ సందర్శించి బాలకార్మికుల నిర్మూలన, విద్య ప్రాముఖ్యాన్ని తెలియజేశారు. బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపాలని ప్రతిజ్ఞ చేయించారు.

## అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి

గూడూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల సమస్యలను వెంటనే ప్రభు త్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు ఇంద్రావతి, ప్రభావతి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ ఏవో శిరీషాకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

## హెల్మెట్ ధరిస్తేనే పెట్రోల్




శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరిస్తేనే పెట్రోల్ పట్టాలని 1వ పట్టణ పోలీసులు తెలిపారు. 1వ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, విద్యాసంస్థల వద్ద నో హెల్మెట్, నో పెట్రోల్ అన్న నినాదంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణరక్షణ పొందవచ్చని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. అదే విధంగా వాహనాలకు సంబంధించి పత్రాలను పక్కాగా ఉంచుకోవాలన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల గురించి అవగాహన కల్పించడంలేదు

### పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య సమరయోధుల ప్రాముఖ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం లేదని జనసేన నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదుచేశారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలో స్వాతంత్ర్య సమరయోధులు జయంతి, వర్ధంతి, రాజ్యాంగ దినోత్సవం, ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం వంటివాటికి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులకు దేశచరిత్ర, స్వాతంత్ర్య సమర యోధుల కృషిపై అవగాహన లేకపోతోందన్నారు. దీనిపై తగురీతిలో స్పందించాలని కోరారు. పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, మణి, గంధంశ్రీను, మహేష్, వెంకటేష్, నవీన్, గోపి, చందు తదితరులు పాల్గొన్నారు.

## అరణియార్ అభివృద్ధికి నిధులు కేటాయించండి


తుడా చైర్మన్‌తో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరణియార్ ప్రాజెక్టు సమీపంలో పర్యాటక అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, నిధుల కొరతతో పనులు ముందుకు సాగడం లేదని ఎమ్మెల్యే ఆదిమూలం తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం సాయంత్రం తుడా చైర్మన్‌తో కలసి పిచ్చాటూరు అరణియార్ పర్యాటక అభివృద్ధికి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల పూర్తికి అదనంగా రూ.60 లక్షల కేటాయించాలని కోరారు. పనుల కోసం నివేదికను అందిస్తే నిధులు మంజూరు చేయిస్తానని దివాకర రెడ్డి చెప్పారు. అలాగే పిచ్చాటూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి పోస్టాఫీస్ వరకు మురుగునీటి వ్యవస్థ నిర్మాణానికి తుడ నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవీ ప్రమాణం



నాగలాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ మొదలియార్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నాగలాపురం మండలం వెంబాకం గ్రామానికి చెందిన నమఃశివాయం పదవీ ప్రమాణం చేశారు. సోమవారం విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో చైర్మన్ త్యాగరాజన్, జాయింట్ డైరెక్టర్ ఉమాదేవి ఆధ్వర్యంలో పదవీ ప్రమాణం చేసినట్టు ఆయన తెలిపారు.

## క్వారీ అనుమతులు రద్దు చేయండి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భవానీ శంకర పురంలో క్వారీకి ఇచ్చిన అను మతులు రద్దు చేయాలని సర్పంచ్ రాజయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సర్వే నెం.28పిలోని 23 ఎకరాల్లో కొంతకాలంగా దళితులు సాగు చేసుకుంటున్నారని, అయితే ఆ భూమిలో క్వారీకి ఎన్‌వోసీ ఇవ్వడం భావ్యమా అని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అంజేశారు. దళితులకు మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించండి


నిరసన తెలుపుతున్న సహకార సంఘ ఉద్యోగులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సహకార సంఘ ఉద్యోగులు నిరసన చేపట్టరు. ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్య వేదిక పిలుపు మేరకు పట్టణం లోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 2019, 2024 పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేసి అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలను అమలు పరచాలన్నారు. ప్రతి కుటుంబానికి రూ20లక్షలు టర్మ్ ఇన్సూరెన్సు పాలసీ చేయించాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అంద జేశారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు చిరంజీవి రెడ్డి, తంగేళ్లపాళెం, కాపుగున్నేరి, కోవనూరు, కాటూరు సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో నరసన్నపేట ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్న అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడిని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు జరిపి గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

## శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయకస్వామి ఆలయం వద్ద సంకట చతుర్థి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతిహోమం నిర్వహించుకునే విధంగా ఆలయ అధికారులు సంకట చతుర్థి హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా సోమవారం అంజంజి గణపతి ఆలయం వద్ద కలశ స్థాపన అనంతరం గణపతి హోమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి సత్యవేడు

### నేటినుంచి పాపానాయుడుపేట వద్ద ట్రాఫిక్ మళ్లింపు

ఏర్పేడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల వద్ద 200 మీటర్ల సిమెంటు రోడ్డు పనుల కారణంగా పాపానాయుడుపేట నుంచి ముసలిపేడు, చెల్లూరు, మడిబాక, కుక్కలగుంట మీదుగా వెళ్లాల్సిన వాహనాలు టీసీఎల్ రూట్‌లో ప్రయాణించనున్నాయి. పాపానాయుడుపేట, గుడిమల్లం సర్వీసులు యథావిధిగా నడవనున్నాయి.

## జాతర శోభ


ప్రత్యేక అలంకరణలో ఏడుగంగల అమ్మవారు



ఏడు గంగమ్మ ఆలయం వద్ద, పెండ్లిమండపం, భేరివారి మండపం వద్ద విద్యుత్ దీపాలంకరణలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏడు గంగమ్మల జాతర శోభ నెలకొంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం అర్ధరాత్రి వరకు ఏడు గంగమ్మల జాతర జరగనుంది. ఈ మేరకు ఆదివారం చాటింపుతో జాతరకు శ్రీకారం పలికారు. అయితే ఒక రోజు ముందుగానే సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని వీధుల్లో విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. దేవతామూర్తుల చిత్రాలు, విద్యుత్ దీపాలంకరణలు ఆకర్షణగా నిలిచాయి. జాతర ఒకరోజు ముందే సందడి నెలకొంది.

### ట్రాఫిక్ మళ్లింపు



ఏడుగంగమ్మల జాతరను పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం అర్ధరాత్రి వరకు ఏడుగంగమ్మల జాతరను పురస్కరించుకుని ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గంగమ్మ కొలువుదీర్చే ప్రాంతాల్లో బుధవారం ద్విచక్ర వాహనాలకు సైతం అనుమతి ఉండదన్నారు. ఇక ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను బైపాస్‌మీదుగా మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

### కోళ్లపై విషప్రయోగం



కేవీబీపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి సీకే పురం గ్రామానికి చెందిన అరవింద్ అనే వ్యక్తికి చెందిన కోళ్లకు గుర్తు తెలియని వ్యక్తులు విషప్రయోగం చేయడంతో అవి మృత్యువాత పడ్డాయి. జాతి కోళ్లు, పుంజులు, మేలురకం జాతిరకం పిట్టలు చనిపోయాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

వరదయ్యపాళెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరదవాడ గ్రామానికి చెందిన పాడి రైతు తలారి చంద్రయ్యకు చెందిన గేదె రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానంగా ఉన్న తీగ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని చంద్రయ్య చెప్పాడు.

### విత్తనకాయల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలవాయిలో విత్తనోత్పత్తి పథకం కింద వేరుశనగ విత్తన కాయలను ఎఫ్‌పీవో కన్నయ్యనాయుడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఉచిత విత్తనకాయలతో పండించిన పంటను తామే కొనుగోలు చేస్తామని తెలిపారు. ఫీల్డ్ సూపర్‌వైజర్ గోపికృష్ణ, డైరెక్టర్ మణెమ్మ పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పిచ్చాటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరువాయి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో మహ్మద్‌రఫి తనిఖీ చేశారు. కేంద్రంలో కిచెన్ గార్డెన్‌పై ఆరా తీశారు. రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో యుగంధర్‌రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

### 12న కలెక్టరేట్ ముట్టడి

పుత్తూరు టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ఐసీడీఎస్ కార్యాలయంలో ఇన్‌చార్జి సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అములు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మెనూ చార్జీలు పెంచాలని కోరారు.

## మెరుగైన బోధనే టీచ్ టూల్ లక్ష్యం


దిశానిర్దేశం చేస్తున్న ఎంఈవో బాలయ్య

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మెరుగైన విద్యాబోధనకు టీచ్ టూల్ దోహదపడుతుందని ఎంఈవో బాలయ్య అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండురోజుల టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థి కేంద్రిత బోధనా పద్ధతులు, పిల్లల్లో సృజనాత్మకత పెంపు తదితరాలు టీచ్ టూల్‌తో సాధ్యమ న్నారు. శిక్షణ పూర్తయిన తరువాత ఉపాధ్యా యులు పాఠశాలల్లో విధిగా టీచ్‌టూల్ అబ్జర్వే షన్ చేయాలన్నారు. హెచ్ఎం వెంకటయ్య, గోపి, రిసోర్స్ పర్సన్లు, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకుని విద్యార్థులకు నాణ్యంగా బోధించాలని చైల్డ్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ పుష్పలత సూచించారు. బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరదయ్యపాళెం, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ మండలాల ఉపాధ్యాయులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... విద్యా విధానంలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకువచ్చిందన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, హెచ్ఎం రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దగ్గుబాటి పురందేశ్వరికి ఆహ్వానం



శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం విద్యాసంస్థల సిల్వర్ జూబ్లీ వేడుకలకు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని డైరెక్టర్లు గుడ్లూరు మయూర్, ఐశ్వర్యలక్ష్మి సోమవారం ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

## గిరిజన విద్యార్థులకు క్రీడల్లో మెరుగైన శిక్షణ ఇప్పించండి


మంత్రిలో మాట్లాడుతున్న సుబ్బయ్య

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు క్రీడల్లో మెరుగైన శిక్షణ ఇప్పించాలని రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన విభాగం అధ్యక్షుడు దారునాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహామండలి సభ్యుడు సుబ్బయ్య కోరారు. మంగళగిరిలో సోమవారం ఆయన వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న గిరిజన సమస్యలు గురించి వివరించారు. కిట్లను అందజేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు సుబ్బయ్య తెలిపారు.

## సీఐటీయూ సభలకు విరాళాల సేకరణ

పిచ్చాటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహా సభల నిర్వహణకు యూనియన్ నాయకులు విరాళాలు సేకరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఇంద్రాణి, రాజేశ్వరి ఆధ్వర్యంలో పిచ్చాటూరు, సత్యవేడు, నాగలాపురం పట్టణాల్లోని షాపుల వద్ద విరాళాలు సేకరించారు. సీఐటీయూ ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు, మురుగేష్, మునిశంకర్, శంకరయ్య, మునిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నారాయణవనం, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలతకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో తొలిసారిగా మాట్లాడుతూ ఎస్ఐగా పోలీస్ స్టేషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. సంఘ విద్రోహ చర్యలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, సారా, గంజాయి, మత్తుపదార్థాలు కలిగి ఉన్నా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్రెండ్లీ పోలీసుగా అందిరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

## ఎస్ఐల బాధ్యతల స్వీకరణ


రాఘవేంద్ర - ప్రియాంక

పిచ్చాటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బి.రాఘవేంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధి నిర్వహణలో రాజీ లేకుండా కృషి చేస్తానన్నారు.

**సత్యవేడు (ఆంధ్రజ్యోతి):** సత్యవేడు శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ప్రియాంక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న ప్రియాంక బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా రెండు రోజుల క్రితం చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న తరుణ్, బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న సుధీర్ కుమార్‌రెడ్డి కూడా శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐలుగా బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న అరుణ్‌కుమార్‌రెడ్డిని బదిలీ చేశారు. దీంతో శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్‌కి ముగ్గురు ఎస్ఐలు బాధ్యతలు చేపట్టారు.

### బాల్యవివాహాల నిర్మూలనపై వ్యాస రచన పోటీ

ఏర్పేడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలన, అక్రమ రవాణాపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మునిలక్ష్మి, ఉపాధ్యాయులు భారతి, శోభ,సంధ్య, లక్ష్మి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

### ప్రమాణస్వీకారానికి ఆహ్వానం

ఏర్పేడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఈనెల 13న జరుగుతుందని ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ రావాలని ఏర్పేడు మండల టీడీపీ నాయకులను ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన చెంచయ్యనాయుడు సోమ వారం ఆహ్వానించారు. ఏర్పేడు మండల కేంద్రంలో టీడీపీ నాయకులను ఆహ్వానించారు. కాగా పలు మండలాలకు చెందిన నాయకులు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

### మేర్లపాలక వద్ద అదుపు తప్పి కారు బోల్తా

డ్రైవర్‌కు తీవ్రగాయాలు



ఏర్పేడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళ్తున్న కారు ఏర్పేడు మండలం మేర్లపాక టోల్‌ప్లాజా సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డీఆర్‌డీఏ శాఖ ఉద్యోగి చిట్టిగుంట సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. కారు బోల్తా పడటంతో డ్రైవింగ్ చేస్తున్న సురేష్ కారులో ఇరుక్కు పోయాడు. అదే మార్గంలో వస్తున్న టీడీపీ ఏర్పేడు మండల నాయకులు ఆయన్ను కారునుంచి వెలుపలికి తీసి 108 అంబులెన్స్‌లో తిరపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

## మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ధనపాల్ ప్రమాణ స్వీకారం



పుత్తూరు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ధనపాల్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం విజయవాడలోని బీసీ కార్పొరేషన్ భవనంలో కార్యక్రమం జరిగింది. నగరి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. టీడీపీ పుత్తూరు పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, కరుణాకరన్, బాబునాయుడు, ఆనంద్, బీఆర్ మురళి, బీఎస్ హరి, ధనంజయనాయుడు, జయచంద్ర నాయుడు, ఈశ్వర్ యాదవ్, మహమ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభ చూపిన దివ్యాంగులకు ప్రోత్సాహం

వడమాలపేట,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా క్రీడల్లో ప్రతిభ చూపిన దివ్యాంగులకు పతకాలు అందజేసి వారిలో ఉత్సాహన్ని కలిగించారు. సోమవారం భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన లాంగ్‌జంప్, పరుగు పోటీల్లో యువరాజ్, జాహ్నవి బంగారు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా వారికి ఎంఈవో పద్మావతి పతకాలను అంద జేశారు. సహిత విద్య ఉపాధ్యాయురాలు హేమలత, దివ్యాంగుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పుత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అన్నూరు లైన్‌కు సంబంధించి కొత్త బ్రేకర్‌ను ఏర్పాటు చేస్తున్నందున లక్ష్మీనగర్, కళ్యాణపురం సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా ఉండదని డీఈ ఆశీర్వాదం తెలిపారు.

### ఎస్టీయూ కార్యవర్గం

పుత్తూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల ఎస్టీయూ సంఘానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా మునిరాములు, అధ్యక్షుడిగా వెంకటేశులు, ప్రధానకార్యదర్శిగా వెంకట్, కోశాధికారిగా యుగంధర్ ఎన్నికయ్యారు. జయచంద్రన్, వెంకటేశయ్య పరిశీలకులుగా వ్యవహరించారు.

### పదవీ విరమణ వయసు పెంచాలి

పుత్తూరు టౌన్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో పనిచేస్తున్న తమ పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలని ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపి రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పుత్తూరు సహకార సంఘం బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కోటి రెడ్డి మాట్లాడుతూ జీవో 36ను వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు రూ.5 లక్షలకు ఆరోగ్య బీమా కల్పించాలని, ప్రతి ఉద్యోగికి రూ. 20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్న, విజయ్, టీ.చెంగయ్య, వేణు, కన్నప్ప రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, PONNAMREDDI SUREKA RANI, W/o. KOTHAPATI CHANDRA MOULI REDDY (Old Name) R/o D.No. 5-320/10, Flat No.9, Gayathri Nagar, M.R.Palli, TIRUPATI Dt, AP.,INDIA. I Have a changed my name as PONNAMREDDI SUREKHA RANI, W/o. KOTHAPATI CHANDRA MOULI REDDY (New Name).

AJT - 1218

WANTED

తిరుపతి ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సూపర్‌వైజర్స్ స్త్రీ, పురుషులు కావలెను. స్థానికులు మాత్రమే. హిందీ మాట్లాడగలగాలి. జీతం : 15,000/-. సంప్ర. : 97031 44467, 68

AJT - 082619

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.

AJA- 257599

WANTED

తిరుపతి విద్యానగర్ నందు శ్రీ సాయి శ్రీనివాస హాస్పిటల్ మరియు మెడికల్స్ షాపు నందు పనిచేయుటకు పురుషులు కావలెను. సంప్ర. : 9441995779, 9441088705

AJT - 082618

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి